PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 07.12.2012, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 27 పేజీలు : 12, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్

నెలలు తక్కువ బిడ్డా ? సంరక్షణ కొరకు...

పుట్టిన పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)



Dr. T. Ravikumar's

రిచ్ హాస్పిటల్

రవి చిన్నపిల్లల హాస్పిటల్

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# ఈ బఫూన్స్

## అధిష్టానం వలలో పడ్డారు


- జోకర్లుగా మారుతున్న టి-కాంగీ ఎంపీలు
- ఢిల్లీ పెద్దల చేతిలో రిమోట్‌లు

సర్కస్‌లో బఫూన్లకు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలకు పెద్ద తేడా కనిపించడం లేదు. ఒకపక్క కాంగ్రెస్ అధిష్టానం అంటే భయం... ఇంకో పక్క తెలంగాణ కోసం పోరాడుతున్నట్లు డ్రామా... అటు పార్టీకి విధేయులమన్నట్లు నటిస్తూ... ఇటు తెలంగాణ వాదులమన్నట్లు జీవిస్తూ జోకర్లలా తయారవుతున్నారు.

టీ-కాంగ్రెస్ ఎంపీల ఫోరానికి నాయకత్వం వహిస్తున్న పొన్నం ప్రభాకర్ గాని, ఆయనతో వుంటున్న మధుయాష్కీ, మందా జగన్నాథం, రాజయ్య, వివేక్‌లకు గాని అధిష్టానాన్ని లొంగ దీసుకునే చేవలేదు. అధిష్టానం కళ్లెర్రజేస్తే ఫ్యాంట్లు తడుపుకునే పరిస్థితి వీరిది. మొన్న లోక్‌సభలో ఎఫ్‌డిఐలపై ఓటింగ్ సందర్భంగా వీళ్లెక్కడ ఎగ్గొడతారోనని అధిష్టానం భయపడి ఈ నెల 28న తెలంగాణపై అఖిలపక్షానికి అంగీకరించింది. వాస్తవానికి అధిష్టానం వీళ్లకు అంత సీనిచ్చి వుండాల్సింది కాదు. ముందు వచ్చి ఓటేసి పొమ్మనుంటే అందరూ కదలకుండా వచ్చి ఓటేసిపోయేవాళ్లు.

తెలంగాణను ఉద్ధరించేది మేమేనన్నట్లు ఫోజులు కొడుతున్న ఈ బఫూన్ ఎంపీలను ఈ స్థాయికి తీసుకొచ్చింది వై.యస్.రాజశేఖరరెడ్డి. ఆయన ఇమేజ్‌తోనే వీళ్లు రెండుసార్లు ఎంపీలు కాగలిగారు. వై.యస్. వున్నంతకాలం తెలంగాణ విషయంలో వీళ్ల నోర్లు విప్పలేదు. (మిగతా 10వ పేజీలో)

# గుజ్రాల్ ఇక లేరు



భారత మాజీప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు, విప్లవకారుడు అయిన ఇందర్‌కుమార్ గుజ్రాల్ 2012 నవంబరు 30వతేదీ కన్నుమూశారు. ఒక సంవత్సరం రోజులుగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతూ ఆయన చివరిశ్వాస వదిలారు. 1997, ఏప్రియల్ 21న ఆయన సంకీర్ణ రాజకీయాలలో దేశానికి ప్రధానమంత్రి అయ్యారు. కొన్ని విషయాలలో మాత్రమే గుజ్రాల్ వివాదాస్పదుడైనారు. వామపక్ష భావజాలాన్ని వంట పట్టించుకున్న వ్యక్తి, ఉదారవాది. జాతీయ రాజకీయాలలో ఆయన ముద్ర ఎప్పుడూ వుండేది. 1975లో నాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించినపుడు కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రిగా గుజ్రాల్ వ్యవహరించారు. పత్రికలపై ఉక్కుపాదం మోపిన (మిగతా 10వ పేజీలో)

# సాహితీ విశిష్టతకి... ప్రతిష్ఠాత్మక అవార్డు

## డా॥ నాగభైరవ స్మారక సాహితీ పురస్కారం అందుకున్న తనికెళ్ళ భరణి

(వివరాలు 7వ పేజీలో...)



# ప్రారంభ రిజిస్ట్రార్‌గా.. కొలువుకు సెలవు



నెల్లూరుజిల్లా విద్యారంగానికే తలమానికంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా దివంగత మహానేత అందించిన గొప్ప వరం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం. ఒక అత్యున్నత ఆశయంతో ఆ మహనీయుడు నెల్లూరీయులకు ఈ కానుకను అందించాడు. యూనివర్శిటీ ప్రారంభ వి.సి., రిజిస్ట్రార్‌లుగా ఆచార్య సి.ఆర్. విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డిలను నియమించింది ప్రభుత్వం. వైస్‌ఛాన్సలర్‌గా కొద్ది నెలల క్రితం విశ్వేశ్వరరావు పదవీ విరమణ పొందగా ఆయన స్థానంలో ఆచార్య జి.రాజారామిరెడ్డి బాధ్యతలను తీసుకున్నారు. ప్రారంభం నాటి నుండి రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొ॥ నారాయణరెడ్డి నవంబరు 30వ తేదీన రిజిస్ట్రార్ పదవికి గుడ్‌బై చెప్పి బదిలీపై వెళ్లిపోయారు.

2008 ఆగష్టు 27వ తేదీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ నారాయణరెడ్డి యూనివర్శిటీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు. తన ప్రతిభానైపుణ్యంతో నెల్లూరుజిల్లాలో వున్న 130ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధి నుండి విక్రమసింహపురి యూనివర్శిటీ పరిధిలోకి తీసుకువచ్చారు. ప్రారంభంలో ప్రాథమిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, ఉపాధి అవకాశాలు ఎక్కువగా వున్న 6 విభాగాలను ముందుగా నెలకొల్పి ఆ విభాగాలు తక్షణమే ప్రారంభమయ్యేలా తాత్కాలిక అధ్యాపకులను నియమించడం చకాచకా జరిగిపోయాయి. విద్యార్థినీవిద్యార్థులను విశేషంగా ఆకర్షించి వారికి జీవనోపాధి కల్పించగలిగే వారధులుగా ఆయా శాఖలను తీర్చిదిద్ది ప్రభుత్వంతో సంప్రదించి దాదాపు 20మంది పూర్తికాల బోధనాసిబ్బందిని నియమించారు. కావలిలో వున్న పి.జి. సెంటర్‌ను, విద్యానగర్‌లోని యన్.బి.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలను విక్రమ సింహపురి యూనివర్శిటీకి అనుసంధానం చేయడంలో నారాయణరెడ్డిది ముఖ్యపాత్ర. టూరిజం, (మిగతా 3వ పేజీలో)

# 'చితి'కి పోతున్న చిన్నారుల బతుకులు

బలపం పట్టాల్సిన చిట్టిచేతులు గునపం పట్టాయి. అక్షరాలు దిద్దాల్సిన చేతితో అంట్లు తోమించారు. పలకను తుడవాల్సిన చేతులు దాబా బల్లలను తుడిచాయి. ఆడిపాడే వయసు... అగచాట్ల పాలయ్యింది. చిరుప్రాయంలోనే నరకప్రాయం ఏంటో చూసింది. అమ్మ గోరుముద్దలు తినాల్సిన వయసులో నిరంకుశుడి చేతిలో చావుదెబ్బలు తిన్నాడు. చివరకు ఆ పసిప్రాయం మసిబారింది... అదే వయసులో పాడెక్కాడు. చిరుప్రాయంలోనే చితికెక్కాడు.

బాల్యంకు..



బానిస సంకెళ్లు


గూడూరు డివిజన్ మండలకేంద్రమైన చిల్లకూరు సమీపంలోని వరగలి అడ్డరోడ్డు వద్ద యదనపర్తి మురళీరెడ్డి అనే వ్యక్తి తన స్వంత డాబా హోటల్లో ఏడు సంవత్సరాల గిరిజన బాలుడ్ని కొట్టి చంపేశాడు. మరో పైశాచిక విషయం ఏమిటంటే చంపేసిన బిడ్డ (వెంకటేశ్వర్లు), తల్లిదండ్రులతో పాటు, మరో ఏడు కుటుంబాలు మురళీరెడ్డి వద్ద సంవత్సరాలుగా వెట్టి చేస్తుండటం. డాబా యజమానైన ఇతను వెంకటేశ్వర్లు తండ్రికి 10వేలు అప్పుగా నాలుగుసంవత్సరాలక్రితం ఇచ్చి (మిగతా 3వ పేజీలో)

PDF Compressor Free Version



● ధైర్యంగా ఓ అడుగు

# ఎన్నికలకు 'సహకారం'



**ఎన్నికలంటేనే డెంగ్యూ జ్వరం వచ్చినట్లుగా వణికిపోతుంది రాష్ట్ర ప్రభుత్వం. కాబట్టే నిర్ణీత కాలవ్యవధిలో ఏ రకమైన ఎన్నికలను కూడా నిర్వహించలేదు. సహకార సంఘాలను మొదలుకొని జిల్లా పరిషత్‌లు, మున్సిపాల్టీలు, పంచాయితీ... ఇలా అన్ని రకాల ఎన్నికలను వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారు. దీనికంతటికీ కారణం ఎన్నికలే జరిగితే ఓడిపోవడం ఖాయమని అధికారపార్టీకి పట్టుకున్న భయం.**

ఈ భయంతోనే దేనికీ ఎన్నికలు నిర్వహించలేదు. మున్సిపల్ ఎన్నికలనైతే ఇప్పటికి నాలుగుసార్లు వాయిదా వేసారు. స్థానిక సంస్థల పాలనా పగ్గాలను ఇన్‌ఛార్జ్ లుగా అధికారులకు అప్పగించి వాటిని నిర్వీర్యం చేస్తున్నారు.

2014లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు తప్పితే ఈమధ్యలో ఎటువంటి ఎన్నికలు వుండవనుకుంటున్న తరుణంలో ప్రభుత్వం ముందుగా సహకార ఎన్నికలకు సాహసించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండు దశల్లో సహకార ఎన్నికలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధమైంది. సహకార ఎన్నికలకు సంబంధించి జనవరి 10న నోటిఫికేషన్ విడుదల కాబోతుంది. జనవరి లోనే రెండు దశల్లో ఎన్నికలను పూర్తి చేయనున్నారు.

2009 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాలో ఎటువంటి ఎన్నికలు లేవు. శాసన మండలి ఎన్నిక జరిగినా అది ప్రజలకు సంబంధించింది కాకపోవడంతో సందడి కనిపించలేదు. కాని సహకార ఎన్నికల ప్రకటనతో రాజకీయ వాతావరణం వేడెక్కే సూచనలున్నాయి. ఈ ఎన్నికలలో ఫలితాలు ప్రస్తుతం నెలకొన్న రాజకీయ ట్రెండ్‌కు సంకేతాలుగా నిలుస్తాయి.

జిల్లాలోని 46మండలాలలో 99 వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి. జిల్లా కేంద్ర సహకార సంఘానికి 2005 డిసెంబర్ 10వ తేదీన ఎన్నికలు జరిగాయి. అప్పట్లో కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ పదవి కోసం కాంగ్రెస్‌లోనే రెండు వర్గాలు పోటీపడ్డాయి. తెలుగుదేశం నామమాత్రంగా మిగిలిపోయింది. అప్పుడు నేదురుమల్లి వర్గీయుడైన వాకాటి నారాయణరెడ్డి సహకార బ్యాంకు అధ్యక్షుడు కాగలిగాడు. 2010 డిసెంబర్‌లో ఆయన పదవీకాలం పూర్తయ్యింది. తర్వాత కొంత కాలం ఇన్‌ఛార్జ్‌గా కొనసాగి, ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక ఆ బాధ్యతల నుండి తప్పుకున్నారు. కాగా రేపు నిర్వహించబోయే సహకార ఎన్నికలు మరింత రసవత్తరం కానున్నాయి. కాంగ్రెస్, తెలుగుదేశంతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులు కూడా రేపు అన్నిచోట్లా పోటీ చేయనున్నారు. ఎవరిసత్తా ఏంటో ఈ ఎన్నికల లోనే బయటపడబోతుంది.

మేకపాటికి...







## కంట్లో నలుసు కొమ్మి

**రాజకీయాలలో నా రూటే సపరేటు అన్నట్లుండే నాయకుడు కొమ్మి లక్ష్మయ్యనాయుడు. కొట్టడానికైనా, కొట్టించుకోవడానికైనా రెడీ అన్నట్లుంటాడు. ఆయన అనుకున్న పనులు కావడమే ఆయనకు ముఖ్యం. ఇలాంటి తత్వంగల వారితో అందరూ సర్దుకుపోలేరు. కాబట్టే ఆయన పార్టీ మారాల్సివచ్చింది. తెలుగుదేశంపార్టీని వదిలేసేటప్పుడు కూడా ఆయన శాంతంగా రాలేదు. చంద్రబాబును ఆయన ముఖాన్నే తిట్టి వచ్చాడు. మరి చంద్రబాబునే లెక్కచేయని కొమ్మికి మేకపాటి సోదరులు పెద్ద లెక్కకాదు.**

ఆయనను పార్టీలోకి తీసుకోవడం మేకపాటి సోదరులకు మొదటినుండి మింగుడుపడడం లేదు. వాళ్ళు బలంగా వ్యతిరేకించినా, జగన్ కావాలనే ఆయనను తీసుకున్నాడు. ఎందుకంటే అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనేది జగన్ ఉద్దేశ్యం. ఈ లెక్కన చూస్తే కమ్మ సామాజిక వర్గంలో బలమైన నాయకుడు కొమ్మి.

జిల్లాలో ఒక్కచోటైనా కమ్మ సామాజికవర్గానికి సీటివ్వాలనే ఆలోచనలో జగన్ వున్నట్లు తెలుస్తుంది. ఈ లెక్కనచూస్తే కొమ్మికే అవకాశం ఎక్కువ. కొమ్మికి సీటు ఇస్తామనే గ్యారంటీతో పార్టీలోకి తీసుకోలేదు. కాని తగిన ప్రాధాన్యతనిస్తామని చెప్పివున్నారు. అయితే ఎన్నికలప్పటికి సామాజికవర్గాల సమీకరణలో ఆయనకు సీటివ్వాల్సిరావచ్చు. అప్పుడు ఆత్మకూరు నుండే ఆయనను దింపాల్సి వుంటుంది. ఇది మేకపాటికి ఇష్టం వుండదు. ఎందుకంటే వారి సొంత మండలం మర్రిపాడు ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోకే వస్తుంది. తమ మండలాన్ని తమకు పడని కొమ్మి చేతుల్లో పెట్టడానికి ఇష్టపడరు. అందుకే వాళ్ళు కొమ్మికి సీటివ్వాలనుకుంటే ఆత్మకూరు కాకుండా వెంకటగిరి ఇవ్వమని కోరుతున్నట్లు తెలుస్తుంది. మరి జగన్ ఎంతవరకు వింటాడో చూడాలి.

మందుబాబులకు

కిరణ్ కిక్కు!



## బాదుడే బాదుడు!

**అన్నిరకాల సర్‌ఛార్జ్‌ల పేరుతో అన్ని వర్గాల ప్రజలను వేపుకుతింటున్న కిరణ్ సర్కార్ మందుబాబులను కూడా వదలడం లేదు. తాగిన మత్తు దిగేలా రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలను పెంచేసింది. చీప్‌లిక్కర్ మొదలుకొని బ్రాండెడ్ మద్యం వరకు అన్నిరకాల మద్యంపై 5 నుండి 15రూపాయల వరకు పెంచేసారు. దీంతో మందుబాబులు ఇప్పుడు రెండు విధాలుగా దోపిడీకి గురికావాల్సి వస్తుంది.**

ఈ ఏడాది లాటరీ విధానం ద్వారా మద్యం షాపులను కేటాయించడం జరిగింది. మద్యం సిండికేట్‌ల రూపంలో జరుగుతున్న అక్రమాలను నివారించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గతంలో వున్న టెండర్ విధానాన్ని తీసేసి లాటరీని ప్రవేశపెట్టడం తెలిసిందే! ఎమ్మార్పీ ధరలకు మద్యాన్ని విక్రయించాలన్న లక్ష్యంతోనే ఈ లాటరీని ప్రవేశపెట్టారు.

కాని మొదట్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు చేసారు. తర్వాత యథాఫలంగా మద్యం వ్యాపారులు సిండికేట్‌లు కట్టసాగారు. దాంతో యథాప్రకారం ఎమ్మార్పీ రేట్లను పక్కకు నెట్టి అధికధరలకే విక్రయిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం పెంచిన మద్యం ధరలతో మందుబాబుల జేబులకు చిల్లుపడనుంది. కాకపోతే అదేం ఖర్మోగాని అధికధరలకు మద్యాన్ని అమ్ముతున్నా, ధరలను పెంచేస్తున్నా తాగే మోతాదు పెరుగుతుందేగాని ఏ మాత్రం తగ్గడంలేదు.

# రెచ్చిపోతున్నారు

## ➤ నెల్లూరును దొంగలకు రాసిచ్చినట్లుగా వుంది

*జాతీయ రహదారిమీద టోల్‌గేటుకు వేలంపాట పెడతారు... చాలామంది పాటలో పాల్గొంటారు. ఎక్కువ మొత్తానికి ఎవరు పాడితే వాళ్ళకు టోల్‌గేటు లైసెన్స్ వస్తుంది. నిర్ణయించిన కాలమంతా వాళ్ళు టోల్‌గేటు వద్దకు వచ్చే వాహనాలను ఆపి డబ్బులు దండుకుంటూ వుండొచ్చు.*

నెల్లూరు నగరానికి కూడా దొంగల ముఠాలన్నీ కలిసి అలాంటి వేలంపాట ఒకటేమన్నా నిర్వహించాయేమోననే అనుమానాలొస్తున్నాయి నగరంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలను చూస్తుంటే! దొంగలముఠాలన్నీ ఒకచోట చేరి వేలంపాట పెట్టుకుని వుంటాయి. ఎక్కువ మొత్తానికి పాడిన ముఠా నెల్లూరులో దొంగతనాలు చేసుకోవడానికి లైసెన్సు పొంది వుంటుందనిపిస్తుంది. దొంగలకు కూడా ఇక లైసెన్స్‌లివ్వడం మేలనిపిస్తుంది.

ఇటీవలకాలంలో జరుగుతున్న దొంగతనాలు గతంలో ఎప్పుడూ లేవు. చోరీ జరుగని

## ➤ పోలీసు పనితీరు ప్రశ్నార్థకమవుతుంది




రోజంటూ లేకుండా పోతుంది. ఇంటికి తాళంవేసి ఒకరోజు బయట ప్రాంతాలకు వెళ్లాలంటేనే జనం భయపడుతున్నారు. ఇంతకుముందు విడిగృహాలలో దొంగతనాలు ఎక్కువగా జరిగేవి. అపార్ట్‌మెంట్లలో కొంత భద్రత వుంటుందని భావించేవాళ్లు. కాని ఇప్పుడు అపార్ట్‌మెంట్లలోనూ అభద్రతాభావం చోటుచేసుకుంటుంది. మొన్న సరస్వతినగర్‌లోని సాహితి అపార్ట్‌మెంట్‌లో కోవూరు మండలం పాటూరు విఆర్‌ఓ జనార్థన్‌రెడ్డి ఫ్లాటులో పట్టపగలే దోపిడీ జరిగింది. దాదాపు 15లక్షల సొత్తు పోయింది. పట్టపగలే ఇలా దోచుకుపోతుంటే నగరంలో పోలీసులేం చేస్తున్నారని చాలామంది ప్రశ్నిస్తున్నారు.

దొంగతనాలు ఎక్కువవుతున్నాయనిచెప్పి ఇంటికో పోలీసును కాపలా పెట్టలేరుగా? కాకపోతే పోలీసుభయం అనేది ఒకటుంటే దొంగతనాలు తక్కువగా వుంటాయి. దొంగలు చోరీలకు పాల్పడడం,

(మిగతా 10వ పేజీలో)

PDF Compressor Free Version



ఆదర్శం

శ్రీగాయత్రి విద్యార్థుల

# మానవతా సాయం




విద్యార్థి తల్లికి ఆర్థికసాయాన్నందజేస్తున్న శ్రీగాయత్రి విద్యార్థులు

నెల్లూరులోని శ్రీగాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు మానవత్వంతో స్పందించారు. తమలోని దాతృత్వాన్ని బయటకు తీసారు. బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ విద్యార్థికి చేయూతనందించాలనే తపనతో చేయిచేయి కలిపారు. 33,500 రూపాయలు పోగేసి ఆ విద్యార్థి తల్లిదండ్రులకు అందించారు. దుత్తలూరు మండలం తురకపల్లి గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, సుభాషిణిల కుమారుడు నరేష్ 6వ తరగతి చదువుతున్నాడు. గత కొంతకాలంగా నరేష్ బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అతని వైద్యానికి లక్షల్లో ఖర్చవుతుండగా, ఆ పేద కుటుంబం భరించలేని స్థితిలో వుంది. ఇది తెలిసిన గాయత్రి విద్యార్థులు తమవంతుగా 33,500రూపాయలు సేకరించి తమ కళాశాల ఏజిఎం, జోనల్ ఇన్‌ఛార్జ్, ప్రిన్సిపాల్‌ల చేతులమీదుగా ఆ కుటుంబానికి అందించారు.

# పెదపుత్తేడు జడ్పీ హైస్కూల్ స్వర్ణోత్సవాలు

దగదర్తి మండలంలోని పెదపుత్తేడు రామలింగాపురంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ సంబరాలు ఈ నెల 8న జరుగుతున్నాయి. ఈ పాఠశాల పుట్టి యాభైసంవత్సరాలయిన సందర్భంగా పూర్వవిద్యార్థులు, పాఠశాల సిబ్బంది సమిష్టి నిర్వహణలో జరుగుతున్న ఈ వేడుకలో సాయంత్రం పాఠశాలలో నిర్మించిన నూతన భవనం తదితర కట్టడాల ప్రారంభం, తదుపరి విద్యార్థులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పాఠశాల విద్యాకమిటీ తెలిపింది. ఆరోజు ఉదయం 9గంటలకు మొదలయ్యే వేడుకలు రాత్రి 10.30గంటలకు ముగియనున్నాయి.

కాలధర్మం

# మంకు వెంకటేశ్వర్లు




నెల్లూరుజిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులలో ఒకరైన మంకు వెంకటేశ్వర్లు తన 77వ యేట అనారోగ్యంతో డిసెంబర్ 1వ తేదీన మృతి చెందారు. ఈయనకి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు వున్నారు. వెంకటేశ్వర్లు నెల్లూరుజిల్లాలో రైస్ మిల్లుల అసోసియేషన్ ఏర్పాటుకు కృషి చేయడమే కాక, అసోసియేషన్‌కు సొంత భవనం నిర్మించడంలో ముఖ్యపాత్ర పోషించారు. ఈయన గతంలో బి.సి. సంక్షేమ సంఘానికి, యాదవ సంఘానికి అధ్యక్షులుగా పనిచేసి వెనుకబడిన తరగతుల వారి సంక్షేమం కోసం ఎంతో కృషి చేసారు. శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం కమిటీ ఛైర్మెన్‌గా కూడా పని చేశారు. వెంకటేశ్వర్లుకు రాజకీయంగా అన్నిపార్టీల వారితో మంచి సంబంధాలున్నాయి. ఆయన మృతికి ప్రగాఢసంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# లోకకల్యాణ శాంతియజ్ఞం

నెల్లూరులోని పురమందిరం నందు ఈ నెల 8, 9, 10తేదీలలో కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీపీఠ తృతీయ పీఠాధిపతులు జగద్గురు శ్రీ శివచిదానంద భారతి మహాస్వామి, ప్రస్తుత పీఠాధిపతి జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి వార్ల ఆధ్వర్యంలో లోకకల్యాణ శాంతియజ్ఞములు నిర్వహిస్తున్నారు. ఈ మూడురోజుల పాటు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, నరఘోష, సరస్వతీ మంత్రోపదేశములు, శివపార్వతుల కల్యాణం, సహస్ర లింగాభిషేకము, పూర్ణాహుతి, 18 నదీ జలాలలో కుంభాభిషేకం, 1116 శివ లింగాలను పెన్నానదిలో నిమజ్జనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## గుర్తొస్తున్నారు..



'ఇదీ నా కథ' ద్వారా 63వారాల పాటు తన ఆత్మకథను 'లాయర్' పాఠకులతో పంచుకున్న సహజకవి, నెల్లూరు సీమ ముద్దుబిడ్డ

**కీ॥శే॥ యం.యస్.రెడ్డి గారు**

భువి నుండి దివికేగి తేది.11-12-12కి ఏడాది గడవనున్న సందర్భంగా ఆ పెద్దాయన స్మృతిని స్మరించుకుంటూ...

సం/-

# యోగా'రత్నం'కు సత్కారం



నవంబర్ 24వ తేదీన రష్యాలోని మాస్కో నగరంలో జరిగిన అంతర్జాతీయ స్థాయి యోగా ఆసనాలలో అండర్-12 విభాగంలో 40మందితో పోటీపడి స్వర్ణపతకం, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్‌పెయిర్‌ల నందు కాంస్య పతకాలు సాధించిన రత్నం ఒలింపియాడ్ బ్యాచ్ 8వ తరగతి విద్యార్థి కె.జోషితను గురువారం నెల్లూరులోని హోటల్ లియో నందు జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జోషిత రత్నం విద్యాసంస్థకే కాక నెల్లూరుజిల్లాకే మంచి పేరు తెచ్చిందని అభినందించారు. చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తున్న రత్నం డైరెక్టర్లు డా॥ కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్‌లను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో రత్నంస్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్స్ మనోజ్‌కుమార్, రుక్మిణి, మేనేజర్లు రాజేష్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొలువుకు సెలవు

(మొదటిపేజీ తరువాయి)




బయోటెక్నాలజీ వంటి కోర్సులను ఏర్పాటు చేయడం, జిల్లాలో వున్న కృష్ణపట్నం పోర్టు, షార్, రిలయన్స్ పరిశ్రమలు, నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వంటి సంస్థలతో అవగాహన ఒప్పందం చేసుకుని, ఫైర్ & సేఫ్టీ, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులకు రూపకల్పన చేసి ప్రముఖ యూనివర్శిటీల సరసన విక్రమ సింహపురిని నిలబెట్టడంలో నారాయణరెడ్డి కృషి అభినందనీయం.

2009లో తెలుగువారి ప్రియతమ నేత డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి సువర్ణ హస్తాలతో యూనివర్శిటీకి ప్రారంభోత్సవం జరిపించి, స్వంత భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వంతో నిరంతర చర్చలు జరిపి స్థలాన్ని సేకరించి 2011లో ప్రస్తుత ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేయించడంలో రిజిస్ట్రార్‌గా నారాయణరెడ్డి శ్రమ అంతా ఇంతా కాదు.

విద్యాలయాలు నడవాలంటే అతి ముఖ్యమైన అంశం హాస్టల్ అనే విషయాన్ని పరిగణలోకి తీసుకుని బాలికల కోసం డి.కె.డబ్ల్యు కాలేజీలోనూ, బాలుర కోసం కొండాయపాలెం ప్రాంతంలోని వసతి గృహాలలోనూ వాటిని ప్రారంభింపజేశారు. ఇక మరో ముఖ్యమైన కార్యక్రమం "ప్లేస్‌మెంట్స్". తమ యూనివర్శిటీలలో చదివే వారికి వారి అర్హతలకు, మేధస్సుకు, ప్రతిభకు తగ్గట్లుగా ఉద్యోగాలు రావాలనే లక్ష్యంతో ప్లేస్‌మెంట్ సెల్‌ను ఏర్పాటుచేసిన ఘనత కూడా నారాయణరెడ్డిదే. మనసు పెట్టి పనిచేస్తే, క్రమశిక్షణతో పాటుపడితే అభివృద్ధికి హద్దేలేదని నిరూపించారు నారాయణరెడ్డి. తాను పనిచేసే సంస్థ ఏదైనా అది తన స్వంతం, అక్కడ పనిచేసే వారంతా తన కుటుంబసభ్యులని భావించే తత్వం ఆయనది. అనతికాలంలో అనితర సాధ్యుడిలా యూనివర్శిటీ అభివృద్ధికి ఆయన పాటుపడ్డారు. పూర్వ వి.సి. విశ్వేశ్వరరావు, ప్రస్తుత వి.సి. రాజారామిరెడ్డిల అండదండలతోనే తానీ విజయాలన్నీ సాధించగలిగానంటారాయన. ఆయనకున్న కార్యదక్షత, పట్టుదలే యూనివర్శిటీని అత్యున్నతస్థానంలో నిలిపిందనడానికి అక్షర సాక్ష్యాలు.

పేదవిద్యార్థులకు తన స్వంత నిధుల నుండి ఆర్థికసహాయం అందించడం, తనకున్న పరిచయాలతో తమ యూనివర్శిటీలో చదివిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడం వంటి మానవీయ కోణాలతో నారాయణరెడ్డి యూనివర్శిటీ సిబ్బంది దృష్టిలోను, విద్యార్థినీ విద్యార్థుల మనసుల్లోనూ దేవుడిగా మిగిలాడు.

## ఆయన బాటలో ఆమె...

భర్త అడుగుజాడల్లో కర్తవ్యమే దైవంగా భావించే లక్షణాలున్న శ్రీమతి సుధానారాయణరెడ్డి కూడా విక్రమసింహపురి యూనివర్శిటీలో కంప్యూటర్‌సైన్స్ విభాగానికి అధిపతిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. 2010 నుండి డీన్(ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్)గా పదవిని చేపట్టి భర్త ఆదర్శంగా యూనివర్శిటీ అభివృద్ధికి అహరహం కృషి చేశారు. తన పదవీ కాలంలో ఎన్నో ప్రయోగాలను చేసి విద్యార్థులను ఆకట్టుకున్నారు. 4సంవత్సరాల పాటు తమ సేవల ద్వారా ఎందరి మనసులనో దోచుకుని, నెల్లూరులోని తమ అనుభవాలను, మధురస్మృతులను మదిలో దాచుకుని నవంబర్ 30వ తేదీ బదిలీపై వెళ్లిన ఈ సేవా దంపతులకు "లాయర్" అభినందనలు.

# చిన్నారుల బ్రతుకులు


(మొదటిపేజీ తరువాయి)

అప్పటి నుంచి ఆ దంపతులను తన వద్ద వెట్టికి అట్టిపెట్టుకున్నాడు. ఒక్క వెట్టి చేయటమే కాకుండా వారిపై దౌర్జన్యం కూడా చేసేవాడు. ఇది భరించలేక ఆ దంపతులు పారిపోతే పట్టుకొని వచ్చి దాబాలో పడేసి కొట్టి అప్పు వెంటనే చెల్లించాలంటూ పసిబిడ్డనుంచుకొని వారిని తరిమేశాడు. అప్పటి నుంచి మూడునెల్ల పాటు ఆ ఏడేళ్ల బిడ్డను చిత్రహింసలు పెట్టాడు. 2వతేదీ మురళీరెడ్డి కొట్టిన దెబ్బలకు బిడ్డ చనిపోయాడు. అర్ధరాత్రి తన తండ్రిని బిడ్డ తల్లిదండ్రుల వద్దకు పంపాడు. ఆరోగ్యం బాగాలేదని చెప్పమన్నాడు. తీరావారు దాబాకు వచ్చి చూస్తే బిడ్డ విగతజీవుడైవున్నాడు. 50వేలు డబ్బిచ్చి తీసుకెళ్లి. పూడ్చేయమని చెప్పాడా కిరాతకుడు. డబ్బు వద్దంటూ మురళీ చంపిన బిడ్డను తీసుకొని నేరుగా 3వతేదీ పోలీస్ స్టేషన్‌కెళ్లారు తల్లిదండ్రులు. పోలీసులు కేసు నమోదు చేశారు. గూడూరు సబ్ కలెక్టర్ రంగప్రవేశం చేశాడు. నెల్లూరు జిల్లా కలెక్టర్ సంఘటన తీవ్రత తెలుసుకొని వెళ్లి విచారించారు. మంత్రి శైలజానాథ్ దోషులను వదలిపెట్టొద్దంటూ ఆదేశాలిచ్చారు. బిడ్డను చంపేసి మాయమైన మురళీని 4వ తేదీ పోలీసులు పట్టుకున్నారు.

వెట్టిచాకిరి, బాలకార్మిక వ్యవస్థను లేకుండా చేయాలని ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి వుంది. అందుకు కొన్ని ప్రభుత్వ శాఖలు నిరంతరం పనిచేస్తున్నట్లుంటాయి. కానీ బాలకార్మికులు బార్‌లలో, హోటళ్లలో, మెకానిక్‌షాపులలో, టీ అంగళ్లలో ముఖ్యంగా అధికారులు, ధనవంతుల ఇళ్లలో కావాల్సినంత మంది ప్రతిరోజూ అధికారులకు, స్వచ్ఛంధసంస్థల వారికి, సమాజంలో ప్రతి ఒక్కరికీ కనపడుతూనే వుంటారు. అయినా పట్టించుకొనే నాథుడులేడు. కలవారిళ్లలో ఘోరాలు బయటకు కానరావు. వయసుకొచ్చిన బాలికాకార్మికుల అవస్థనైతే వ్యవస్థ ఏమాత్రం తీర్చదనేది స్పష్టం. ఎక్కడో ఒక చోట ఇదిగో ఇలాంటి మురళీరెడ్డి పాశవిక చర్య ద్వారా వెలుగు చూసిన సంఘటనలప్పుడు చాలామంది స్పందిస్తారు. ఆ కుటుంబానికి న్యాయం జరగాలంటూ ప్రకటనలు, మీడియా సమావేశాలు పెట్టారు. అంతటితో అయిపోతుంది. ప్రభుత్వ అధికారులను తమ కనుసైగలతో కట్టడి చేయగల కుటుంబాలు, వ్యాపారులు, వాణిజ్య ప్రముఖుల ఇళ్లలో సాగుతున్న బాలకార్మిక వ్యవస్థ అంతం కాదు. కానీయరు. అలా అయితే ఉదయం లేసినప్పటి నుండి నిద్రపోయే వరకు తమ అవసరాలు తీర్చే కడుపుకూటోళ్లు లేకుంటే ఎట్లా? 'ఛీ' అనిపించటం లేదు వీరిని గురించి ఆలోచించినప్పుడు. బిడ్డను చంపేసిన మురళీరెడ్డికి ఏ శిక్ష వేస్తే మాత్రం ఏం లాభం.

PDF Compressor Free Version






## పనబాకకు కృతజ్ఞతలు

కోట మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు పనబాక దంపతులు కృషి చేస్తున్నారు. కోట మండలం లక్ష్మక్కకండ్రిక, తిన్నెలపూడి గ్రామ ప్రజలు తారురోడ్డు కావాలని అడుగగా, పనబాక కృష్ణయ్య వెంటనే మంజూరు చేయించారు. ఈ రెండు గ్రామాలలోని హరిజనవాడ ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. మా గ్రామస్థుల తరపున పనబాక దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాము.

వరాల లక్ష్మీనారాయణ,
వరాల బాలాజీ,
వరాల చిన్న కస్తూరయ్య,
సూళ్లూరు గవాస్కర్,
తిన్నెలపూడి.

## ప్రచారంలేని అభివృద్ధి

గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమంలో ప్రచారం లేకుండానే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆశ్రమ అధికారి సుబ్రహ్మణ్యం ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా వుంటూ ఆశ్రమ అభివృద్ధికి మాత్రం అహర్నిశలు శ్రమిస్తున్నారు. అతిథి గదులు, గోశాల, వృద్ధాశ్రమం, ఉన్నతపాఠశాల, సిమెంట్‌రోడ్డును మాడవీధులుగా తీర్చిదిద్దడం, అన్నదానశాల... ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి గొలగమూడిని తిరుమల మాదిరిగా చేస్తున్నారు. ఆయనకు నా అభినందనలు.

వాస్తు రామచంద్ర,
నెల్లూరు.

## కొండముచ్చులు

'కోతి బట్టితెచ్చి కొత్త పుట్టము గట్టి కొండముచ్చులెల్ల చేరి కొలువ' అను వేమన పద్యం కాంగీ హైకమాండ్ చేసే పునర్వ్యవస్థీకరణకు అద్దంపడ్తోంది. అవినీతి కాంగీ కొండముచ్చులు తమ నాయకుడికి పెద్దపీట(పెద్దపీడ) వేస్తున్నందుకు, ఆయన చేతికి పార్టీ పగ్గాలు (పిచ్చివాని చేతిలో రాళ్లు) ఇస్తున్నట్లు చెప్పకుని తెగ సంబరపడిపోతున్నారు. దేశ భవిష్యత్తు కొండముచ్చుల బారిన పడకుండా చేయవలసిన బాధ్యత కాంగ్రెసేతర పార్టీల పైన వుంది. దేశప్రయోజనాల దృష్ట్యా వారు ఐకమత్యంతో మెలగడం ఎంతైనా అవసరం.

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

# 'ప్రభా'తం

ఒక పంచాయితీ నుండి ఎవరు గెలవబోతున్నారో వూహించవచ్చు... ఒక అసెంబ్లీ నుండి ఎవరు గెలవబోతున్నారో చెప్పేయవచ్చు... ఒక లోక్‌సభ స్థానంలో ఏ పార్టీ ముందంజలో వుందో ముందుగానే అంచనా వేయొచ్చు. కాని పోలింగ్ జరుగక ముందే, ఒక్క ఓటు కూడా పడకముందే ఒక రాష్ట్రంలో ఏ పార్టీ గెలుస్తుందని ముందుగానే నిర్ణయించేయడం బహుశా రాజకీయ చరిత్రలోనే చాలా అరుదైన విషయమై వుంటుంది. ఆ అరుదైన విషయమే ఇప్పుడు గుజరాత్‌లో చోటు చేసుకుంటుంది.

త్వరలో గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే ప్రచారం కూడా ఉధృతస్థాయిలో సాగుతోంది. ఎన్నికలన్నాక ఇరు పార్టీలవైపు అభ్యర్థులు, పోటాపోటీ ప్రచారాలు, గెలుపోటములపై అంచనాలు సర్వసాధారణం. కాని గుజరాత్‌లో గెలుపుపై ఒక పార్టీ మాత్రమే అంచనాల్లో వుండడం ఆశ్చర్యం కలిగించే పరిణామం. గుజరాత్‌లో ప్రతిపక్ష కాంగ్రెస్‌పార్టీకే గెలుపుపై అంచనాలు లేవు, ఆశలూ లేవు. ఈ పరిస్థితులు ఎందుకు వచ్చినట్లు? ఏ రాష్ట్రంలోనైనా ప్రతిపక్షం అధికారంలోకి వస్తే అది ప్రతిపక్షం పట్ల ప్రజలకున్న నమ్మకంతో కాదు, అంతకుముందున్న ప్రభుత్వం పట్ల, పాలించిన నాయకుడి పట్ల ప్రజలలో నమ్మకం సడలిపోవడం వల్లే. ఆ పరిస్థితి గుజరాత్‌లో లేకుండా పోయింది.



## ఇది మోడీయిజం

లోకమే కాదు మీడియా కూడా కోడై కూస్తుంది గుజరాత్‌లో మళ్లీ గెలుపు మోడీదేనని. అభివృద్ధి అనే మంత్రదండంతో గుజరాతీలను తన వశం చేసుకున్నాడు మోడీ! ఆయన అభివృద్ధి మంత్రమే జాతీయ రాజకీయాలలో ఆయనను హీరోను చేస్తుంది.

తన నాయకత్వం పట్ల మోడీ ప్రజలలో నమ్మకాన్ని పెంచుకుంటున్నాడే గాని, ఏ మాత్రం తగ్గనీయడం లేదు సరికదా ఆయన ఇమేజ్ అంతకంతకు పెరుగుతూ వచ్చి ఈరోజు ప్రధాని అభ్యర్థి రేసులో ఆయనను ముందు వరుసలో నిలబెట్టింది. గుజరాత్‌లో బీజేపీ ఆయనను ఒక్కసారే ముఖ్యమంత్రిని చేసింది. కాని ఆయన మూడుసార్లు ఆ పార్టీని ఆ రాష్ట్రంలో అధికారంలో నిలబెట్టారు.

నరేంద్ర మోడీ... భారతదేశంలోనే ఈరోజు ఒక విలక్షణమైన నేతగా గుర్తింపు పొందారు. ఆయన కుటుంబ వారసత్వంతో పైకొచ్చిన నాయకుడు కాదు. స్వయంశక్తితో స్వయంసేవక్ నుండి ఎదిగినవాడు. నాయకుడిగా పరిపాలకుడిగా తానేంటో నిరూపించుకున్నాడు. ఆయన గుజరాత్ పగ్గాలు చేపట్టేనాటికి ఆ రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో వుండింది. అంతకంటే కూడా ఆయన పార్టీ ఇబ్బందుల్లో వుండింది. ఆ తర్వాత ఆ రాష్ట్రంలో తలెత్తిన భూకంపాలు కూడా అక్కడి ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారాయి. 2002లో గోద్రా దుర్ఘటన అనంతరం జరిగిన అల్లర్లు మోడీ పాలనకు మాయని మచ్చగా మిగిలాయి. మోడీని ఇవి పెద్ద మతోన్మాదిగా చూపించాయి. మోడీ గుజరాత్ పగ్గాలు చేపట్టాక గుజరాత్ అసెంబ్లీకి రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే... ఆ రాష్ట్రంలో మోడీ ఒక్కడే ఒక వైపు నిలిస్తే, ప్రతిపక్షం, మీడియా, వివిధ సంస్థలు ఇంకో వైపు నిలిచాయి. కాని గుజరాత్ ప్రజలు మాత్రం మోడీవైపు అంతకన్నా కూడా ఆయన అభివృద్ధి మంత్రం వైపే నిలిచారు. అభివృద్ధి అనే మంత్రదండాన్ని ప్రయోగించి గుజరాత్ ప్రజలను తన వశం చేసుకున్నాడు మోడీ.

గోద్రా అల్లర్లలో ఇక్కడ మైనార్టీలకు అన్యాయం జరిగిన మాట వాస్తవమే. కాని ఆ తర్వాత రాష్ట్రంలో ఒక్క మత ఘర్షణ అంటూ లేదు. మతపరంగా ఎవరినీ హింసించింది, వేధించింది కూడా లేదు. ఎందుకంటే మెజార్టీలు, మైనార్టీలనే బేధం లేకుండా గుజరాత్ ప్రజలను ఆయన అభివృద్ధిలో ఒక భాగం చేసారు. మోడీ పాలనలో అందరూ అభివృద్ధి చెందారు. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే బేధం చూపలేదు. బీజేపీ అధికారంలో వుంది కాబట్టి అక్కడ మైనార్టీలను చిన్నచూపు చూడలేదు. అందరితో కలిసి వారిని గుజరాతీయులుగానే చూసారు. కాబట్టే వాళ్లలోనూ మేము మైనార్టీలమనే భావం లేకుండా పోయింది. ఈరోజు మైనార్టీలు సైతం మోడీయిజం వైపు ఆకర్షితులవుతున్నారంటే కారణం ఆయన పరిపాలనలో అభివృద్ధి సాధించడం వల్లే!

ఈరోజు గుజరాత్ అన్ని రంగాలలో శరవేగంగా అభివృద్ధి చెందడానికి కేవలం మోడీ ఒక్కడు చేసిన కృషే కారణం కాదు, అంతకుముందు ముఖ్యమంత్రులుగా చేసినవాళ్లు కూడా ఎంతో శ్రమపడ్డారు. కాని మోడీ గుజరాత్ అభివృద్ధిపై తనదైన మార్క్‌ను చాటుకోగలిగారు. ఏ పనైనా నిబద్ధతతో చేపట్టారు. క్రమశిక్షణతో పూర్తి చేసారు. నేటి తరాలనే కాదు, భవిష్యత్ తరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ఆయన అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసారు. కాబట్టే ఈరోజు మిగతా రాష్ట్రాలు పలు రకాల సమస్యలతో అల్లాడుతున్నా గుజరాత్ మాత్రం అన్ని సమస్యలను అధిగమించి అభివృద్ధి పథంలో సాగుతుంది.

గుజరాత్‌లో మరోసారి మోడీ జెండా ఎగరడం ఖాయమని సర్వేలు, మీడియానే కాదు, ప్రతిపక్ష కాంగ్రెస్ సైతం ఒప్పుకుంటున్న వాస్తవం. రేపు గెలిస్తే గుజరాత్‌లో బీజేపీకి వరుసగా నాలుగో విజయమవుతుంది. అంటే పశ్చిమబెంగాల్‌లో కమ్యూనిస్టుల రికార్డును సమం చేయడమే. కాకపోతే అక్కడకీ ఇక్కడికీ వున్న తేడా... అది కమ్యూనిస్టుల గెలుపయితే, ఇది మాత్రం మోడీ విజయం. ముఖ్యమంత్రిగా పనిచేస్తూ ఒక నాయకుడు ప్రధాని స్థాయి ఇమేజ్ తెచ్చుకోవడం అరుదులో అరుదు. కాని ఇప్పుడు మోడీకి దేశవ్యాప్తంగా ఆ ఇమేజ్ వచ్చింది. గుజరాత్‌లో రేపు గెలిస్తే జాతీయ రాజకీయాలపై మోడీ ప్రభావం తీవ్రంగా వుండబోతుంది. ఇది పచ్చి నిజం.

# 'అంతర్'జాతీయం

- బీజేపీలో ప్రధాని పదవికి నరేంద్రమోడీ అన్ని విధాలా అర్హుడని సుష్మాస్వరాజ్ పేర్కొంది. ఆమె అభిప్రాయాన్ని బీజేపీలోని పలువురు నాయకులు సమర్థిస్తున్నారు.
- రాజకీయ నాయకులకు, సినిమా స్టార్‌లకు గుడులుకట్టే సంస్కృతి ఇంతకాలం తమిళనాడులోనే వుండేది. తాజాగా యూపీలో సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు ఆ పార్టీ అధినేత ములాయంసింగ్‌కు గుడి కడుతున్నారు.
- యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలిలో రైలు చక్రాల తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటుచేసే ప్రతిపాదనలను రైల్వేశాఖ ఖరారు చేసింది. ఇప్పటికే రాయ్‌బరేలిలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటైవుంది.
- జనవరి 18, 19, 20 తేదీలలో రాజస్థాన్‌లోని జైపూర్‌లో కాంగ్రెస్ మేధోమదన సదస్సు జరుగనుంది. 300మంది కాంగ్రెస్ సీనియర్ నేతలు ఈ సదస్సులో పాల్గొననున్నారు.
- అత్యంత శీతలప్రాంతంలో 350కిలోమీటర్ల వేగంతో పయనించే హైస్పీడ్ రైలును చైనా ప్రవేశపెట్టింది. చైనాలోని మూడు ఈశాన్య రాష్ట్రాల మీదుగా ఈ రైలు వెళుతుంది.
- అమెరికా అధ్యక్షుడు ఒబామా కొలువులో భారతీయ సంతతికి చెందిన అంధుడు సచిన్‌దేవ్ పవిత్రన్ ఆర్కిటెక్చురల్, ట్రాన్స్‌పోర్టేషన్ బారియర్స్ కంప్లయన్స్ బోర్డులో సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సంస్థ వికలాంగులకు సేవలందిస్తుంది.
- భారత్–బంగ్లా సరిహద్దుల్లో దాదాపు 850కిలోమీటర్ల మేర ఇనుపకంచె నిర్మాణానికి బంగ్లాదేశ్ అంగీకరించింది. మన దేశంలో త్రిపుర రాష్ట్రం సరిహద్దుల్లో ఈ కంచె నిర్మాణం జరుగుతుంది. అక్రమ చొరబాట్లు, అక్రమరవాణా, సరిహద్దు నేరాలను అదుపు చేయడానికి ఈ కంచె ఉపయోగపడుతుంది.
- చంద్రుడు, అంగారకుడిలపై కూరగాయల సాగుకు చైనా యోచిస్తుంది. దీనివల్ల వ్యోమగాములకు ఆహారం, ఆక్సిజన్ అందుతుందని చైనా వ్యోమగామి శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరక్టర్ డెంగ్‌యాచెంగ్ తెలిపారు.
- కొడుకును వేధించారన్న కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వల్లభనేని చంద్రశేఖర్, అనుపమ దంపతులకు నార్వేలోని ఓస్లో జిల్లా కోర్టు మంగళవారం శిక్షలు ఖరారు చేసింది. చంద్రశేఖర్‌కు 18నెలలు, అనుపమకు 15నెలలు జైలు శిక్ష విధించింది. ఈ శిక్షపై చంద్రశేఖర్ దంపతులు నార్వే హైకోర్టులో అప్పీలు చేయనున్నారు.
- భారత ఒలింపిక్ సంఘంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వేటు వేసింది. వచ్చే ఒలింపిక్ క్రీడల్లో భారత్ పాల్గొనకుండా నిషేధం విధించింది. భారత ఒలింపిక్ సంఘానికి ఒలింపిక్ నిబంధనల ప్రకారం కాకుండా, భారత స్పోర్ట్స్ కోడ్ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తుండడమే ఈ వేటుకు కారణంగా తెలుస్తుంది.

# వార్త వ్యాఖ్య

వార్త :- యూపీఏ పోతే ఎన్డీఏ వుంది. – జేఏసీ సమావేశంలో కేసీఆర్.
వ్యాఖ్య :- **ఆ తర్వాత ఎన్డీఏ పోతే యూపీఏ వుంది అనాల్సి వస్తుందేమో!**

వార్త :- ఇంటి పెద్దకొడుకుగా ప్రజలను ఆదుకోవాలని వుంది. – చంద్రబాబు.
వ్యాఖ్య :- **ఇంటికి పెద్ద కొడుకుగా ఆస్తిని తలాకొంత పంచండి.**

వార్త :- తెలంగాణ రాష్ట్రం అవసరం లేదు. – జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్య
వ్యాఖ్య :- **జనాలకు కూడా అవసరం లేదు... నాయకులకే!**

వార్త :- డబ్బిచ్చి జనాన్ని తెప్పిస్తున్న చంద్రబాబు. – ఎంపీ రాయపాటి.
వ్యాఖ్య :- **డబ్బులివ్వకుండా రావడానికి ఆయనేమన్నా సూపర్‌స్టారా?**

వార్త :- వైకాపాను విలీనం చేసుకుందాం. – రాహుల్ దూతకు నెల్లూరు నేతల విజ్ఞప్తి.
వ్యాఖ్య :- **అందరూ చిరంజీవిలాగా అనుకుంటున్నారా ఏంటి?**

వార్త :- కాంగ్రెస్సే మా శత్రువు. – మంద కృష్ణ
వ్యాఖ్య :- **వాళ్లకున్న శత్రువులతో పోలిస్తే మీరెంత లేండి!**

వార్త :- నగదుబదిలీ పాతదే. – కేంద్రం.
వ్యాఖ్య :- **కాకపోతే ఇంతవరకు నాయకులకే అమలు జరుగుతూ వచ్చింది.**

వార్త :- పద్మభూషణ్‌కు బాపు పేరు సిఫార్సు.
వ్యాఖ్య :- **ఇన్నాళ్లకు ప్రభుత్వానికి తెలివొచ్చిందా?**

వార్త :- ప్రధాని రేసులో నేనూ వున్నా. – ములాయం.
వ్యాఖ్య :- **తమరు కొడుకును సీఎంను చేసిందే అందుకు కదా!**

వార్త :- ఏకాభిప్రాయంతోనే తెలంగాణ. – లగడపాటితో ప్రధాని వ్యాఖ్య.
వ్యాఖ్య :- **తెలంగాణ ఇచ్చేది లేదని డొంక తిరుగుడుగా చెబుతున్నారు.**

వార్త :- సర్‌ఛార్జి విషయంలో జోక్యం చేసుకోం. – హైకోర్టు స్పష్టీకరణ.
వ్యాఖ్య :- **జనం వారి పాట్లు వాళ్లే పడాల్సిందేనా?**

వార్త :- అవినీతిపై కాంగ్రెస్ భారీ సభ.
వ్యాఖ్య :- **ఆ సభలోనే రాజా, కనిమొళి, సురేష్ కల్మాడీ, మధుకోడాలకు సన్మానం ఏర్పాటు చేస్తే సరి.**

వార్త :- గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరించవచ్చు. – ధర్మాన వ్యవహారంపై కేశవరావు.
వ్యాఖ్య :- **ముఖ్యమంత్రికే ఆ స్వతంత్రం లేదన్నమాట!**

# ట్రాఫిక్‌పై దృష్టి

## ట్రాఫిక్ పోలీసుల కార్యాచరణ



నెల్లూరులో ట్రాఫిక్ కంట్రోల్‌పై పోలీసుశాఖ దృష్టిసారించింది. ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగిస్తుండడంతో రోడ్లు అసలు ఎక్కడదాకా ఉన్నాయో ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. నిత్యం రద్దీగావుండే ఆత్మకూరు బస్టాండ్ నుంచి సుబేదారుపేట ఏనుగు పట్టాభి రామిరెడ్డి విగ్రహ కూడలి వరకూగల రోడ్డు దుకాణాలను 2వతేదీన ఆయన తొలగించివేశారు. ప్రత్యేకంగా అక్కడ ఆ ప్రాంతం పోలీసుశాఖకు చెందిన సిసియస్ స్టేషన్, డిఆర్‌డిఏ కార్యాలయం వగైరాలున్నాయి. ఇక ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతమైతే ఎప్పుడూ ట్రాఫిక్‌జామ్ అయ్యే వుంటుంది. పట్టాభిరామిరెడ్డి విగ్రహకూడలికి తూర్పు భాగమంతా నక్కలోళ్ల సెంటర్‌గా వాడుకలో వుంది. వీరంతా నగరంలో తిరుగుతూ కొందరు, అక్కడే కూర్చుని వ్యాపారాలు చేసుకుంటూ, ఆ కూడలినే వారి నివాసస్థలంగా మార్చేసుకున్నారు. మొత్తంమీద చిరువ్యాపారస్తుల పొట్టమీద కొట్టకుండా సిఐ వారిని ట్రాఫిక్‌కు అడ్డం తొలగించి, దుకాణాదారులకు పూర్తిగా రోడ్డు మార్జిన్‌దాటి వ్యాపారం చేసుకోమన్నట్లుంది. చిరువ్యాపారులు అంతగా బాధపడటంలేదు. ట్రాఫిక్ ఆ ప్రాంతంలో జామ్ అవటం లేదు. ఇకపోతే ఆత్మకూరు బస్టాండ్ ఉత్తరం వైపు మాత్రం ఆటోలు, బస్సులు లోపలికి వెళ్లేందుకు వచ్చేందుకు అడ్డంగా నిలపటంతో బాగా ఇబ్బందిగా వుంటుంది. దీనికి ప్రత్యామ్నాయం వైపు ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాల్సి వుంది.

> డేంజర్... యమడేంజర్...

# చేపల పులుసా.. తింటే రోగాలు తెలుసా.!



నెల్లూరు నగరంలో ఓ మంచి నాన్‌వెజ్ రెస్టారెంట్‌కు పోగానే ఒకరు చేపలపులుసు అంటారు... ఇంకొకరు ఫిష్‌ఫ్రై అంటారు. నెల్లూరు అంటేనే రుచికరమైన భోజనానికి అందులోనూ ప్రత్యేకించి చేపల పులుసుకు ప్రసిద్ధి. ఇంతకుముందు చేపలంటే చెరువుల్లో, సముద్రంలో వేటకెళ్లి పట్టుకొచ్చినవి అమ్మే వాళ్లు. హోటల్స్‌వాళ్లు వాటిని కొనేవాళ్లు. కాబట్టి ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్యలు వుండేవి కావు. కాని ఇప్పుడు పరిస్థితి అదికాదు. రెస్టారెంట్‌లలో చేపలపులుసు వంటకాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. చేపల చెరువుల్లో చేపలు పక్వానికి వచ్చాక రైతులు వాటిని వలల ద్వారా పట్టి టన్నుల లెక్కన వ్యాపారులకు అమ్మేస్తున్నారు. చేపల చెరువుల్లో వలలకు చిక్కకుండా కొన్ని చేపలు మిగిలిపోతాయి. అయితే వీటిని ఏరాలంటే, వీటిని పట్టుకుని అమ్మితే వచ్చే ఆదాయంకంటే కూలీలఖర్చు ఎక్కువవుతుంది. అందుకని రైతులు ఒక పురుగుల మందు డబ్బా కొని చేపలచెరువునీటిలో కలిపేస్తారు. నీళ్లు విషమయమై చేపలు చచ్చిపోయి నీటిమీద తేలాడుతాయి. ఇలా తేలాడిన చేపలను పట్టుకుని స్థానికంగా హోటళ్లకు అమ్ముతుంటారు. ఇలాంటి చేపల వంటకాలతో జనాలకు ఆరోగ్యం మాట దేముడెరుగు... అనారోగ్యాలు ఖాయం.

◆ రైతుల పాలిట

# "ఖర్మ"గారం



సహకార రంగంలో అభివృద్ధికి అనేక మార్గాలున్నాయి. కానీ నెల్లూరుజిల్లా కోవూరు మండలం, పోతిరెడ్డిపాళెంలో సహకార వ్యవస్థ ద్వారా ఏర్పాటైన కోవూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ రైతులను ముంచుతుంది. ఒక ప్రణాళిక ప్రకారం ఈ ఫ్యాక్టరీని అన్యాక్రాంతం చేసేందుకు గతంలో అధికారంలో వున్న పార్టీల నేతలు చాలా పావులే కదిపారు. రైతుల సంఘటితం వల్ల ఆ పాచిక పారలేదు. అప్పటి నుంచి సహకార చక్కెర ఫ్యాక్టరీని ఎన్ని విధాల భ్రష్టు పట్టించాల్నో అన్ని విధాల పట్టించేశారు. షేర్లు కలిగిన రైతులు చాలా శాతం చెరకు పంట వేయటం కూడా ఆపేశారు. ఒక వేళ చెరకు వేసినా వారి ఉత్పత్తిని ప్రైవేటు చక్కెర కర్మాగారాలకు తరలిస్తున్నారు. ఇందుకు గల కారణం ఏమిటంటే గతేడాది కోవూరు ఫ్యాక్టరీకి తోలిన చెరకు క్రషింగ్ ఐతే జరిపారుగానీ రైతులకు ఇప్పటి వరకూ చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించలేదు. షేర్లు కలిగిన రెండు వేల మంది చెరకు ఉత్పత్తి రైతులకు 8కోట్ల 84లక్షల రూపాయలు ఫ్యాక్టరీ బకాయిలు (మిగతా 10వ పేజీలో)

హైటెక్ సెక్స్ కేంద్రాలపై...

# పోలీస్ మెరుపుదాడి

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా నెల్లూరు నగరం మారింది. అద్దెకు ఇళ్లు తీసుకోవటం విటులను ఆకర్షించటం అమ్మాయిలతో వ్యాపారం నిర్వహించటం ఎంత మామూలైపోయిందంటే పోలీసులకు మామూలిచ్చినంతగా! అంతా సెల్‌ఫోన్ల మీదే నెల్లూరు నగరం చుట్టుప్రక్కల పల్లెల నుండి అమ్మాయిలను తీసుకురావటం ఒక తరహా అయితే, హైద్రాబాద్, ఒంగోలు, విజయవాడల నుండి కూడా అమ్మాయిలను తీసుకొని వచ్చి అద్దె ఇళ్లలో వ్యాపారం జరుపుతున్నారు. డబ్బు ఆశ చూపి విద్యార్థినులను కూడా ఆకర్షిస్తున్నారని భోగట్టా! నెల్లూరు నవాబుపేట షిర్డీసాయి నగర్‌లోని ఓ ఇంటిపై రెండవ తేదీ రాత్రి పోలీసులు దాడిచేశారు. ముగ్గురు అమ్మాయిలను, విటుడ్ని, వేదాయపాళెంకు చెందిన కేంద్రం నిర్వాహకురాలు నిషా అలియాస్ జొన్న వోయిన సింధు, నవాబుపేట షిర్డీసాయి నగర్ నివాసి వంశీకృష్ణలను అదుపులోకి తీసుకున్నారు.

వంశీకృష్ణ బాగా చదువుకొని అధ్యాపకునిగా ఓ ప్రైవేటు కళాశాలలో ఉద్యోగం చేసుకుంటూ సింధుతో కలిసి సైడ్‌బిజినెస్‌గా వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. వీరిని నగర డిఎస్పీ మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు తెలిపారు. హైద్రాబాద్ తార్నాకకు చెందిన మంగర నందిని, సింగరాయకొండ వాసి పిరమిట్ల ఆదిలక్ష్మిలను, విటుడు నెల్లూరు నవరాల వీధికి చెందిన షేక్‌చాన్‌బాషా, నిర్వాహకురాలు సింధు, ఎంఎస్సీ పోస్టుగ్రాడ్యుయేట్ లెక్చరర్ వంశీకృష్ణల గురించి మీడియాకు వివరాలందించారు. వీరందరిపై కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరుస్తామని వివరించారు.

అంతేకాదు, ఏ ప్రాంతంలోనైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పసిగడితే పోలీసులకు సమాచార మందించాలని ఆయన మీడియా ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు. ఇది బాగానే వుంది కానీ, పోలీసులకు సమాచారమందిస్తే ఆ సామాన్యప్రజ పరిస్థితి ఇంక చెప్పతరమా? ఎన్ని సినిమాల్లో వాస్తవాలు చూడటం లేదు. ఒకవేళ అలాంటి సమాచారం ఫలానావారు అందించారని తెలిస్తే నిర్వాహకుల గూండాల చేతుల్లో వారింట్లో వాళ్లు ఏమవుతారో?

ప్రజలకు సామాజిక బాధ్యత ఉండాల్సిందే! మన పోలీసు వ్యవస్థలో ఒక అడుగు ముందుకు వేస్తే, కాలే లేకుండా పోతుంది. అందుకని కన్నుపోయేంత కాటుక ఎందుకని సామాన్యుని ప్రశ్న. అలాగే ఎక్కడ ఏవి విధమైన అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయో పోలీసులకు తెలుసు. అంతెందుకు మంది మార్బలం లేకుండా పోలీసు వాహనాల్లో కాకుండా కొన్ని రాత్రులు చీకటి ప్రాంతాల్లో నగర సంచారం చేయండి అబ్బో ఎన్ని విషయాలు తెలుస్తాయో!

జరిమానాలతో సరి...

# ఆక్రమాలు ఆగుతాయా మరి!



గ్యాస్ కోసం వెళితే సవాలక్ష ప్రశ్నలు. గ్యాస్ కావాలని వచ్చే వారిని మనుషుల్లా చూడాలన్న ఇంగితజ్ఞానం కూడా ఉండదు. కిరసనాయిలు కోసం రేషన్‌షాపు కెళితే ఏదో భిక్షం అడుక్కునే వాడువచ్చినట్లు ఈ రోజు కాదు ఫలానా రోజురా అంటూ చీత్కరింపు, పెట్రోలు బంకుల్లో దారుణం చెప్పాల్సిన అవసరమే లేదు. నగరం వరకూ తీసుకున్న ఒక బంకుకు, మరో బంకుకు కొలతలల్లో చాలా తేడా, అలాగే కల్తీలో కూడా. ఇప్పుడు మనమిక్కడ ప్రస్తావించిన విషయాలన్నీ అధికారులందరికీ తెలిసినవే. కానీ వాళ్లు మాత్రం ఏమిచేస్తారు. నెల తిరిగేసరికి వారి ఇంట్లోకి చేరే సిరిని వద్దనుకుంటారా? మోకాలడ్డుతారా? ఒకవేళ అలా చేసే పనికిమాలిన అధికారి ఎవరైనా ఉంటే పనులన్నీ ఆయన టేబుల్‌ను బైపాస్ చేసి జరుగుతూ వెళ్లిపోతాయి. అనునిత్యం మనల్ని దోచుకుంటున్న వారిని సహిస్తున్నామంటే, మన అవసరాలు కూడా అంతే. గ్యాస్‌లేకుంటే ఇంట్లో చిర్రుబుర్రులు, గ్యాస్‌కెళితే ఏదో గ్యాస్ ఏజెన్సీని కొల్లగొట్టుకు పోతున్నట్లు చూస్తారు. యజమానులు మాట్లాడినా కొంతవరకు సమంజసమేమో. అక్కడ జీతాలు తీసుకొని పని చేసే వారి గొంతు అబ్బ... వినేందుకే దుర్భరం. ఇక ఫోన్‌లో మాట్లాడాలంటే గగనమే. నెల్లూరు నగరంలో పాతకాపు ఒకాయనకు గ్యాస్ ఏజెన్సీ వుంది. ఆయన ఎక్కడలేని నిబంధనలు పెడ్తాడు. గట్టిగా ఎవరైనా అడిగితే వెళ్లి నీకు దిక్కున్న చోట చెప్పుకోమంటాడు. ఆయన తర్వాత తరం జమానా ఇప్పుడు సాగుతుంది. ఏజెన్సీలో ఈయనెప్పుడుంటాడో ఎవరికీ తెలియదు గ్యాస్‌బుక్ చేసేందుకెళితే అక్కడున్న స్టాఫ్(అందరూ కాదులెండి) మాట్లాడే తీరు చూస్తే పరువున్న వారికి మళ్లా ఆ ఏజెన్సీ గడప తొక్కాలనిపించదు. పేరు మార్చుకోవాలన్నా, ఆఖరికి అడ్రసు మార్చుకోవాలన్నా, పొరపాట్న గ్యాస్ వచ్చి వెళ్లిపోతే తిరిగి తీసుకుపోదామన్నా అక్కడ వినియోగదారునికి ఎదురయ్యే పదజాలం వింటే ఛీ ఎందుకింత బాధ అనిపిస్తుంది. కలెక్టర్ దగ్గర నుంచి క్రిందిస్థాయి ఉద్యోగుల వరకూ అడిగిన వెంటనే ఉచితంగా గ్యాస్ పంపుతున్నాం ఎవరు రికమండ్ చేసినా ఇస్తున్నాం ఎవరికి ఫిర్యాదుచేసి ఏమి పీక్కుంటారో పీక్కోండని పబ్లిక్‌గానే గ్యాస్ ఏజెన్సీల వారు చెప్తున్నారు. ఇదేం భాష, ఇంక వెళ్లిన వారు తమ జుట్టు తాము పీక్కుంటూ బుద్ధి గడ్డి తిని వచ్చామురాదేముడా? అనుకుంటూ తిరిగి వస్తుంటారు. కొంచెం అభిమానంగలవారు చేసేది ఎదవపని అని తెలిసినా బ్లాక్‌లో కొనుక్కుంటున్నారు. ఏమి చేస్తాం. ఇదంతా ఎందుకొచ్చిందంటే మహారాజరాజశ్రీ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీయుత లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో గూడూరు సబ్‌కలెక్టర్ గారు, నెల్లూరుజిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారివారు, మరియు జిల్లా పౌరసరఫరాల అధికారులు నవంబరు 1వతేదీన జిల్లాలో 3గ్యాస్ ఏజన్సీలు, 2కిరోసిన్ హోల్‌సేల్ డిపోలు, 8పెట్రోలు బంకులలో తనిఖీలు నిర్వహించి 2గ్యాస్ ఏజన్సీల, 6 పెట్రోలు బంకుల్లో అవకతవకలను గుర్తించి డీలర్లకు జరిమానా విధించటం జరిగింది. ఒక్క రోజులో 11ఏజన్సీలలో దాడులు నిర్వహిస్తే ఎనిమిదింటిలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. మిగిలిన ముగ్గురూ వారొస్తున్నారని తెలిసి సరిచేసుకొని వుండే అవకాశం ఉంది. అది వేరేసంగతి. ఇకపోతే వీరు తనిఖీనో, దాడో ఏదో ఒకటి చేసిన సుమారు గంట సమయంలో 10 నుంచి 25వేల వరకూ జరిమానా విధించగలిగిన తప్పును కనుగొంటే ఇలాంటి తప్పులు సంవత్సరమంతా జరుగుతున్నట్లేకదా? అదీ సంగతి, మొక్కుబడి వ్యవహారాలన్నీ ఇలాగే వుంటాయి. ఏమి చేస్తాం. ఇకపోతే శ్రీయుత జాయింట్ కలెక్టర్ గారి ఆధ్వర్యంలో జరిగిన తనిఖీలో పదివేల రూపాయల జరిమానా విధించిన వారిలో నెల్లూరు రెడ్డి అండ్ రెడ్డి గ్యాస్ ఏజన్సీ, కృష్ణాగ్యాస్ ఏజన్సీ, పోతిరెడ్డిపాళెంకు చెందిన యుంకే ఫ్యూయల్స్, పడుగుపాడు షిరిడీసాయి ఫిల్లింగ్ స్టేషన్, యస్వీఆర్ ఫిల్లింగ్‌స్టేషన్, నెల్లూరు నగరం ఆత్మకూరు బస్టాండ్ వద్దగల రాజగోపాలరావు హెచ్‌పిసిలున్నాయి. 25వేల రూపాయలు జరిమానా విధించిన వాటిల్లో బిరదవాడ యుసికేయల్‌యస్ ఫిల్లింగ్‌స్టేషన్, కోవూరు చౌదరీబ్రదర్స్ వున్నారు. మొత్తం మీద రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు సంయుక్తంగా జరిపిన తనిఖీల్లో జరిమానాగా ప్రభుత్వ ఖజానాకు చేరింది ఒక లక్షా పదివేల రూపాయలు మాత్రమే. అంటే ఎన్ని లక్షల రూపాయలు ప్రజల వద్ద వీరంతా దోచుకుంటున్నారో? వారికి అధికారులు ఎంతగా అండదండలిస్తున్నారో అర్థం మాత్రమే అవుతుంది.

PDF Compressor Free Version





ఈ నెల 5వ తేదీన నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ఆత్మకూరు నియోజకవర్గ అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. పక్కన ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, అదనపు జేసీ రామిరెడ్డి తదితరులు

## నెల్లూరు కబుర్లు



## బాస్... బాగానే వున్నాడు

అనారోగ్యకారణాలతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి దాదాపు నెలరోజులుగా హైద్రాబాద్‌లో వుంటున్నారు. ఆయన అనారోగ్యంపై రకరకాల వదంతులు వస్తుండడంతో ఆనం అనుచరుల్లో, అభిమానుల్లో ఆందోళన కనిపిస్తుంది. ఎంత బాగాలేకపోయినా వివేకా ఇన్ని రోజులు ఎప్పుడూ నెల్లూరుకు దూరంగా లేదు. కాగా వివేకాకు బాగానే వుందని, త్వరలోనే ఆయన నెల్లూరు వస్తాడని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అంటున్నారు. ఎవ్వరూ అన్న ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ధైర్యం చెప్తున్నారు.

## ఆత్మకూరు నిర్మలమ్మకు గౌరవ డాక్టరేట్

మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆత్మకూరు నిర్మలమ్మకు శ్రీలంకలోని దిఇంటర్నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ కొలంబో నవంబరు 30న యూనివర్శిటీ ప్రాంగణంలోని బండారు నాయకే కాన్ఫరెన్స్ హాలులో గౌరవడాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. 50సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన యూనివర్శిటీ రజతోత్సవాలలో ప్రపంచస్థాయిలో వివిధ రంగాలలో సేవలందించిన వారికి ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. 30సంవత్సరాలుగా అనేక ప్రజాఉద్యమాలలో పాల్గొని పేదప్రజలకు, మహిళలకు విశిష్ట సేవలందించినందుకు సామాజిక కార్యకర్తగా నిర్మలమ్మను గుర్తించి కొలంబో యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్శిటీ ఛైర్మన్ డా॥సి.ఇంద్రపాల, ఇంగ్లాండ్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్ డా॥జాన్‌హాప్సన్, ఆస్ట్రేలియాకు చెందిన ప్రొఫెసర్ డా॥దావెథెరెస్సా తూమే తూయేగయెన్, ఇంటర్నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ కొలంబో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ డా॥మాయిశ్వరేన్ దామెల సమక్షంలో నిర్మలమ్మ డాక్టరేట్ పొందారు.



డాక్టరేట్‌ను అందుకుంటున్న నిర్మలమ్మ

## జాతీయ కవితల పోటీ బ్రోచర్ ఆవిష్కరణ



తమిళనాడు గవర్నర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మూడవ తేదీ చెన్నై రాజ్‌భవన్‌లో నెల్లూరులో నిర్వహించనున్న జాతీయస్థాయి కవితలపోటీ గోడపత్రాన్ని విడుదలచేశారు. నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 2013 జనవరి 20వతేదీ జాతీయస్థాయిలో నెల్లూరు వేదికగా కవితలపోటీలు నిర్వహిస్తున్నారు. గోడపత్రాన్ని విడుదల చేసిన అనంతరం తమిళనాడు గవర్నర్ రోశయ్య మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్న సమయంలో నెల్లూరులో జాతీయస్థాయి కవితలపోటీలు నిర్వహించటం హర్షణీయమన్నారు. నెరసం తెలుగుభాషకు ఈ సమయంలో ఇంతటి ప్రాధాన్యత కల్పించినందుకు నిర్వాహకులను అభినందించారు.

గవర్నర్ రోశయ్యను కలిసిన నెరసం నిర్వాహకులు జయప్రకాష్, రత్నప్రసాద్, కమిటీసభ్యులు మాట్లాడుతూ పోటీలకు కవితలను పంపదలచినవారు 2012 డిసెంబరు 20వతేదీలోగా నెరసం సెల్‌నెంబరు 90107 71622లో సంప్రదించాలని కోరారు.

## రిజిస్ట్రార్‌గా నాగేంద్రప్రసాద్



నెల్లూరు విక్రమసింహపురి విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు నాగేంద్రప్రసాద్ 3వతేదీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ రిజిస్ట్రార్‌గా వున్న నారాయణరెడ్డి బదిలీపై వెళ్లటంతో ప్రభుత్వం నాగేంద్రప్రసాద్‌ను డిప్యుటేషన్‌పై వియస్‌యూ రిజిస్ట్రార్‌గా నియమించింది. విశ్వవిద్యాలయ ఆచార్యులు సిబ్బంది ఆయనను గౌరవసూచకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

## చెడిపోతున్న స్టూడెంట్స్

- తప్పతాగి వీరంగం
- పోలీసులనే గుద్దిన వైనం

మద్యం తాగడం ఒకప్పుడు తప్పుగా భావించేవాళ్లు. కాని ఇప్పుడు మద్యం తాగడం ఒక ఫ్యాషనైపోయింది. ముఖ్యంగా చదువుకునే వయసులోనే విద్యార్థులకు తాగుడు వంటబడుతుంది. స్నేహితులతో కలిసి మద్యం తాగడం ఒక క్రేజ్‌గా భావిస్తున్నారు. ఇలా మద్యంమత్తులో ఓ విద్యార్థి సోమవారం నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్‌లో విధ్వంసం సృష్టించాడు. డిగ్రీ చదివే మాగుంట లే-అవుట్‌కు చెందిన ఓ యువకుడు తన కారు డ్రైవర్‌ను వెనుక ఎక్కించుకుని పీకలదాకా మందుకొట్టి స్పోర్ట్స్‌బైక్‌పై అయ్యప్పగుడి సెంటర్‌లో ఫీట్లు చేసాడు. హైస్పీడ్‌తో వచ్చి గస్తీలో వున్న పోలీసులనే గుద్దాడు. అతని స్పీడుకు పోలీసులు హడలిపోగా, నలుగురు గాయపడ్డారు. వారిని ఆసుపత్రిలో చేర్చారు. ప్రమాదానికి కారణమైన సదరు విద్యార్థిపై పోలీసులు కేసు నమోదు చేసారు. హైస్పీడ్‌బైకులు, మద్యం... విద్యార్థులను జులాయిలుగా తయారు చేస్తున్నాయి.

## కరుణించాడు వరుణుడు



నవంబర్ నెల కూడా వెళ్లిపోయింది... డిసెంబర్ వచ్చింది... చలిని తెచ్చింది... ఇక ఈ ఏడాదికి వర్షాలు లేనట్లే అని అనుకుంటున్న తరుణంలో నెల్లూరును వర్షాలు ముంచెత్తాయి. సోమవారం తెల్లవారుజాము నుండి జడి పట్టుకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో వర్షాలు పడ్డాయి. ఈ సంవత్సరానికి జిల్లాలో ఇవే భారీ వర్షాలు. ఇటీవల వచ్చిన 'నీలం' తుఫాన్ ప్రభావం వల్ల కూడా జిల్లాలో వర్షాలు పడలేదు. సంవత్సరకాలంగా జిల్లా ప్రజలు వర్షాల కోసం మొహంవాచిపోయి వున్నారు. ఇంతవరకు చెరువులు, బావులు నిండలేదు. కాని సోమవారం నుండి కురుస్తున్న వర్షాలతో బావులు, బోర్లు, చెరువుల్లోకి నీరు చేరింది. భూగర్భజలాలు కూడా బాగానే పెరిగాయి. ఇక వర్షాలే లేవనుకున్న తరుణంలో భారీవర్షాలు కురవడంతో రైతులు, ప్రజలు సంతోషిస్తున్నారు.

## క్యాన్సర్ హాస్పిటల్‌కు 10లక్షలు

నెల్లూరు దర్గామిట్టలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ హాస్పిటల్‌లో కొత్తగా నిర్మితమవుతున్న "సర్జికల్‌బ్లాక్", ఔట్ పేషెంట్ విభాగాలకు భగవాన్ మహావీర్ జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ 10లక్షల రూపాయల విరాళాన్ని అందించింది. ఈ భవనాలకు కాగల ఖర్చును పూర్తిగా ట్రస్టు భరించడానికి సిద్ధంగా వున్నట్టు ట్రస్ట్ బాధ్యులు మోహనలాల్‌జైన్, వినోద్‌జైన్, ప్రకాష్‌జైన్, సతీష్‌జైన్‌లు తెలిపారు.

## కోలాహలంగా "రత్నం" క్రీడాసంబరాలు

నెల్లూరు దర్గామిట్టలోని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల రత్నం విద్యాసంస్థల క్రీడోత్సవాలు కోలాహలంగా జరిగాయి. ఖోఖో, కబడ్డీ, పరుగుపందెం మొదలగు జాతీయక్రీడలలో హరనాథపురం, లక్ష్మీపురం, పెద్దబజారు, ఏసినగర్, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెంలలో గల రత్నం విద్యాలయాలలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. క్రీడాసంబరాలను ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పసుపులేటి రామ్మూర్తి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక పరిపక్వతకు, శారీరక దృఢత్వానికి క్రీడలు తోడ్పడతాయని, అందువల్ల చదువుతో పాటు ప్రతి విద్యార్థికి క్రీడలు ఎంతో అవసరమని



పేర్కొన్నారు. పోటీల తదుపరి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు ప్రదర్శించిన వందేమాతరం, దాండియా నృత్యాలు, పిరమిడ్స్, డంబెల్స్, హూప్స్‌తో విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో "రత్నం" యం.డి కె.వేణుగోపాల్, డైరెక్టర్ రమావేణుగోపాల్, ప్రిన్సిపాల్స్, పిఇటిలు రత్నాకర్, లాజర్, శేషయ్య, బాలాజీ, నిరంజన్, గౌస్‌బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దీర్ఘకవిత "నీటిచుక్క" ఆవిష్కరణ

నెల్లూరులోని పోలీస్‌ఆఫీస్‌రోడ్డులోగల హోటల్ అతిథిగ్రాండ్‌లో ఈనెల 2న ప్రముఖ కవి, రచయిత, ఈతకోట సుబ్బారావు రచించిన "నీటిచుక్క" దీర్ఘ కవితను సుప్రసిద్ధ నాటక రచయిత, సినీనటులు, దర్శకులు తనికెళ్ళభరణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తనికెళ్ళభరణి మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో అన్నీ అమ్మకపు వస్తువులుగా మారిపోయి చుక్కనీరు కూడా కరువైపోతుందని, పల్లెల్లో కూడా ఈ పరిస్థితి వుందని అన్నారు. ఈ దశలో ఇటువంటి రచన అవసరం గుర్తించిన ఈతకోట సుబ్బారావు అభినందనీయులని పేర్కొన్నారు.



'నీటిచుక్క' దీర్ఘకవితను ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి

PDF Compressor Free Version



# సాటి లేనిది... వెలకట్టలేనిది... ఈ పురస్కారం

## డా॥ నాగభైరవ స్మారక సాహితీ అవార్డు ప్రదానోత్సవ సభలో తనికెళ్ళ





"డా॥ నాగభైరవ కోటేశ్వరరావు" ఆ పేరు వింటేనే కొందరి మనసులు ఆనందార్ణవాలవుతాయి, అనుభూతి శిఖరాలవుతాయి. కొందరి మనసులు ఆయన చూపిన వాత్సల్యనదిలో తడిసిన క్షణాల తటాకాలవుతాయి. అటువంటి చిరస్మరణీయులైన ప్రఖ్యాతకవికి శిష్యులు కావడం నెల్లూరీయులైన సినీకవి వెన్నెలకంటి, ప్రముఖకవి, ఆడిటర్ చిన్ని నారాయణరావులు తమ అదృష్టంగా భావించారు. భౌతికంగా దూరమయినా తమ హృదయాలలో స్థిరవాసం ఏర్పరచుకున్న తమ గురువు డా॥నాగభైరవకు నివాళిగా వారు ఆయన పేరిట నెలకొల్పిన డా॥నాగభైరవ స్మారక సాహితీ అవార్డును విశిష్ట విద్వత్తు కలిగిన సాహితీస్రష్టలకు మహోన్నతరీతిలో ప్రతి ఏటా ప్రదానం చేస్తూ వస్తున్నారు. ఆ క్రమంలో ఈ సంవత్సరం బహుముఖప్రజ్ఞాశాలి, ప్రఖ్యాత నాటక రచయిత, సుకవి, సులక్షణ నటుడు తనికెళ్ళ భరణికి ఈ అవార్డును ఈనెల 2న నెల్లూరు టౌనుహాలులో ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కావలి శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు, ఆత్మీయఅతిథులుగా 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, నాగభైరవ కోటేశ్వరరావు కుమారుడు నాగభైరవ వీరబాబు, డీసీసీ ఇన్‌ఛార్జ్ అధ్యక్షులు చాట్ల నరసింహారావు, మురళీకృష్ణ హోటల్స్ యండి హజరత్‌బాబులు, అతిథులుగా వాణిజ్యపన్నులశాఖ ఉపకమీషనర్ ఇంతియాజ్, "ఓనమాలు" సినిమా మాటల రచయిత, కావలి పట్టణ వాస్తవ్యులు, సుపరిచిత కథారచయిత ఖదీర్‌బాబులు పాల్గొన్నారు. తొలుత అవార్డు కమిటీ కార్యదర్శి చిన్ని నారాయణరావు స్వాగతవచనాలు పలుకగా సభకు సినీకవి వెన్నెలకంటి అధ్యక్షత వహించారు.

### ఆయనకాయనే సాటి... - వెన్నెలకంటి

సభాధ్యక్షోపన్యాసంలో 'వెన్నెలకంటి' మాట్లాడుతూ నెల్లూరు సాహిత్యరంగానికి నాగభైరవ ఆత్మీయమిత్రుడన్నారు. తనికెళ్ళ భరణి శివభక్తుడని, నాటకాలకు, నాటికలకు, సినిమాలకు మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. నాగభైరవ అవార్డును ఆయనకు అందజేయడం ఆ అవార్డు ఔన్నత్యాన్ని పెంచడమేనని పేర్కొంటూ తనికెళ్ళ ప్రస్థానాన్ని సభకు వివరించారు.

### తనికెళ్ళని చూస్తే నాకు అసహ్యం, కంపరం... - బీద మస్తాన్‌రావు

తనికెళ్ళ భరణిని చూస్తే ఆయన పోషించిన విలన్ పాత్రలు గుర్తొస్తాయని, అందుకే ఆయనను చూసిన వెంటనే తనకు ఆయన మీద కంపరం, అసహ్యం కలుగుతుందని అంటూ ఆయన పోషించిన విలన్‌పాత్రలలో ఆయన అంతగొప్పగా నటించాడని కావలి శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. ఎన్నో హాస్య సన్నివేశాలతో పాటు ఇంకా అనేక పాత్రలు తనికెళ్ళ పోషించినప్పటికీ ఆయన పోషించిన విలన్‌పాత్రలను అవేమీ మరిపించలేకపోయాయని, శివ సినిమా నుండి ఈరోజు దాకా ఆయన పోషించిన ప్రతి పాత్ర దేనికదే సాటని మస్తాన్‌రావు కొనియాడారు. తిక్కన పుట్టిన గడ్డపైన సాహిత్య పురస్కారాన్ని అందుకోవడం తనికెళ్ళ అదృష్టంగా మస్తాన్‌రావు పేర్కొన్నాడు.

### ఇది తెలుగుపండుగ - ఇంతియాజ్

ప్రపంచ తెలుగు మహాసభలు జరుపుకోబోతున్న నెలలోనే ఒక గొప్ప సాహితీవేత్త పేరుతో రూపొందించిన అవార్డు మరో సాహితీమూర్తికి అందించడం గొప్ప తెలుగుపండుగని నెల్లూరు వాణిజ్యపన్నుల శాఖ డిప్యూటీ కమీషనర్ ఇంతియాజ్ అన్నారు. రచనా రంగంలోనేకాకుండా నటనారంగంలో కూడా తనికెళ్ళ తనకు తిరుగులేదనిపించుకున్నారని, అటువంటి గొప్ప వ్యక్తికి ఈ అవార్డు ఇవ్వడం ఎంతైనా సముచితమని తెలిపారు.

సింహపురి సమాచారం

# పేదల పక్షపాతి మాగుంట



మాగుంట వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

కీర్తిశేషులు మాగుంట సుబ్బరామరెడ్డి సేవలు మరువలేనివని, ఆయన పేదల కోసం అహరహం శ్రమించేవారని భారత ఆహారసంస్థ డైరెక్టర్ చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. మాగుంట 17వ వర్ధంతి సందర్భంగా నెల్లూరు నగరం రంగనాయకులపేటలోని రాఘవ కల్యాణమండపంలో ఒకటవతేదీన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుతగా మాగుంట చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన అభిమానులు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పలువురు పార్లమెంటు సభ్యునిగా మాగుంట మారుమూల మెట్టప్రాంతాలను ఎంత అభివృద్ధి పరచింది వివరించారు. ఆయన దాతృత్వాన్ని, క్రమశిక్షణను, సేవానిరతిని కొనియాడారు. కళాశాలలు స్థాపించి ఎంతో మంది చదువుకునేందుకు ఆర్థికవనరులను కూడా సమకూర్చిన మహావ్యక్తి అంటూ ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రమిద శ్రీనివాసులు, కరేడి శ్రీనివాసులు, కె.మూర్తి, బి.కిరణ్‌కుమార్, పవన్‌నాయుడు, కరిముల్లా, మాధవరెడ్డి, రాజా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# నిర్లక్ష్యం వల్లే చోరీలు - నగర డిఎస్పీ



ప్రజలు విలువైన వస్తువులు ఇంట్లో వుంచుకొని సరైన జాగ్రత్తలు తీసుకోక పోవటమే దోపిడీలు జరిగేందుకు ముఖ్యకారణమని నెల్లూరు డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి అన్నారు. నెల్లూరునగరం సరస్వతినగర్‌లోని సాహితీ అపార్ట్‌మెంట్‌లో ఒకటవ తేదీ నేరాల నియంత్రణపై అపార్ట్‌మెంట్‌లలో నివసిస్తున్న వారు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన సమావేశం నిర్వహించారు.

విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్లలోకి ఎవరైనా కొత్తవ్యక్తులు వస్తే వారి వివరాలను అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అపార్ట్‌మెంట్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఎవరిలోనైనా అనుమానాస్పద కదలికలను గుర్తిస్తే వారి వాహనాల నెంబర్లు నోట్‌చేయటం, సమాచారాన్ని అందరికీ అందజేయటం తప్పనిసరిగా చేయాలన్నారు. అలా చేయటం వల్ల నేరసంఘటన జరిగినపుడు నేరస్థులను గుర్తించటం సులభమౌతుందని ఆయన వివరించారు. ముఖ్యంగా ఇంటి యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఉండటం చేస్తే చోరీలను అరికట్టవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

సమావేశంలో సిఐలు కోటారెడ్డి, మద్ది శ్రీనివాసరావు, జి.రామారావు, మంగారావు, ఎస్సైలు మాధవరావు, బాష తదితరులు పాల్గొన్నారు.

### నాగభైరవ అవార్డుకి అసలుసిసలు అర్హుడు తనికెళ్ళ.. - చాట్ల నరసింహారావు

నెల్లూరీయులతో ఎనలేని అనుబంధాన్ని పెనవేసుకున్న నాగభైరవ అవార్డుకి అన్ని విధాలా అర్హుడైన వ్యక్తిగా తనికెళ్ళ భరణిని కీర్తించాడు కాంగ్రెస్‌పార్టీ నాయకుడు చాట్ల నరసింహారావు. తనికెళ్ళ ఏ పాత్ర పోషించినా ఆ పాత్రకు సజీవరూపాన్ని కల్పిస్తారని, ఆ పాత్రను చూస్తున్నట్లుంటుందే తప్ప భరణిని చూసినట్లుగా వుండదని, ఆయన వ్రాసే సాహిత్యం కూడా అందరికీ అర్థమయ్యే భాషతో మధురంగా వుంటుందని 'చాట్ల' ప్రసంసించారు.

### పద్మశ్రీతో మళ్లీ రావాలి - ప్రభు

నెల్లూరు టౌన్‌హాలు కళాకారులకు మంచి సెంటిమెంట్ కలిగిన వేదికని, 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకుని మళ్లీ ఇదే వేదికపై అభినందన సత్కారాన్ని తనికెళ్ళ అందుకోవాలని 'లాయర్' సంగ్రాహకుడు ప్రభు అన్నారు. మొలగొలుకులకు నెలవైన జిల్లా, మంచివాళ్లకు, మనసున్నవాళ్లకు, మేధావులకు, మొనగాళ్లకు కొలువైన ఖిల్లా నెల్లూరుజిల్లా అని, ఇక్కడ ప్రజలు మంచిమనసుతో అందించే దీవెనలు తనికెళ్ళ భవిష్యత్ ప్రణాళికలకు బాటలు కావాలని, తెలుగు సినిమాకి అంతర్జాతీయ సినిమా వేదికపైన అవార్డును సాధించాలన్న భరణి కోరిక నెరవేరాలని ప్రభు తన ప్రసంగంలో ఆకాంక్షించారు.

(మిగతా11వ పేజీలో)






PDF Compressor Free Version



# కదంబం

## మలుపులు

డా॥పులిపాటి గురుస్వామి,
హైదరాబాద్. 98488 87904.

మలుపులు లేని ప్రయాణం
కొత్తగా ఉండదు

ఎంతసేపని కొత్తగా నడుస్తాం
ఎడమకో
కుడికో తిరిగితే
కొత్త దిక్కు
మిత్రుడి వలె హత్తుకొని
దాచిన ముచ్చట్ల మూట
విప్పుతుంది

ఎంతసేపని రోడ్ల వెంట
దుమ్ముపట్టిన నగరాన్ని
ఛీకొట్టుకుంటూ
వాహన కాలుష్యాన్ని తిత్తుల్లో నింపి
ఎగపోసుకుంటూ దొర్లిస్తాం?
ఇంటివైపుకి తిరిగితే
చల్లని పరిచయమైన హస్తం
నీ ప్రేమల నిండా ప్రేమను నింపి
వడపోసిన శ్వాసతో వేడివేడిగా
నీకలతను కావడం పెడుతుంది

ఒక పాడవైన రాత్రిని
సాగిన పగల్ని కూడా
ఆనందించగలమో!లేదో!

కదల్లేని వృక్షాలకి కూడా
ప్రకృతి ఆరు అనుభవాలని
పక్షుల కచేరీతో
పరవశం గాలితో కలిసిన
పులకింతను పూయిస్తుంది
అక్కడ నుండే కదా
బాలింతరాలై జీవులకి
ప్రాణం పట్టేది

రోజా కొంత కొంత
కొత్తదనాన్ని ప్రకటిస్తూ
పక్షంరోజుల్లో
ప్రపంచసత్యం
వెలుతురు చీకట్లని
నీకంటి ముందు నిలబెట్టే
చంద్రుడు కూడా
మలుపెరిగిన మహాత్ముడే

ఎక్కడికి పోలేని తనంతో
స్పర్శకిరాని ప్రపంచం గురించి
ఎంత చెప్పినా రుచి కరువే

హే ఆనందుడా...!

కొంత అనుభవం తర్వాత
తటస్థపడే మృత్యువు కూడా
గొప్ప మలుపే.

## కళకళలాడిన శైవక్షేత్రాలు

నెల్లూరు నగరంలోని శైవక్షేత్రాల్లో 3వతేదీ భక్తులు ఘనంగా కార్తీకదీప పూజలు నిర్వహించారు. ఆలయాలలో కార్తీకదీపాలు వెలిగించి కార్తీకదీప పూజలను భారీగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా శైవక్షేత్రాలకు భక్తులు తరలివెళ్లి పూజలు నిర్వహించారు. ఆలయాల కార్యనిర్వాహణాధికారులు, అర్చక స్వాములు, ఉభయదాతలు ఈశ్వరస్వామికి భక్తిప్రపత్తులతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్తీక సోమవారం నాడు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామని ఆలయాల నిర్వాహకులు తెలిపారు.

# తెలుగుతల్లి అవాక్కయ్యింది

### గల్పిక

"తిరుపతిలో ప్రపంచ తెలుగుమహాసభలు"... తాటికాయంత అక్షరాలతో "ఆత్మసాక్షి" పేపర్‌లో ప్రధాన బ్యానర్. అభాగ్యులు ఎక్కువగా వుండే భాగ్యనగరంలో ట్యాంక్‌బండ్‌పై తెలుగుతల్లి విగ్రహం కింద కూర్చుని ఓ నిర్భాగ్యుడు ఆ వార్త చదువుతున్నాడు. ఆ వార్తను తెలుగుతల్లి కూడా చదివింది. ఆనందంతో ఆ తల్లి హృదయం ఉప్పొంగింది. నా బిడ్డలు నన్ను ఇంతగా అభిమానిస్తున్నారా.. వీళ్ల మనసుల్లో నాకు ఇంత స్థానం కల్పించారా అని మనసులో అనుకుని ఆనందంతో వచ్చిన కన్నీళ్లను తుడుచుకుంది. ప్రపంచ తెలుగు మహాసభలకు ఏర్పాట్లు ఏ స్థాయిలో జరుగుతున్నాయో తెలుసుకుందామనుకుంది. తనొక్కటే కాకుండా వెంట ఎవరో ఒకరుంటే బాగుంటుందనుకుని తెలంగాణ మార్చ్ రోజున అక్కడే పొదల్లో విసిరేయబడ్డ గురజాడ అప్పారావును లేపింది. ఆయన విరిగిన కాళ్లను అతికించుకుని బలవంతంగా లేసి... ఎక్కడికి తల్లి అని అడిగాడు. ప్రపంచ తెలుగు మహాసభల ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో చూసొద్దాం రండి అని అడిగింది. అలాగే అంటూ ఆమె వెంట గురజాడ కూడా బయలుదేరాడు.

అది సచివాలయం... సమాచారశాఖ మంత్రి డి.కె.అరుణ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఆమె మాట్లాడుతూ... తిరుపతిలో వరల్డ్ తెలుగు కాన్ఫరెన్స్ అరేంజ్ చేయాలని గవర్నమెంట్ డెసిషన్ తీసుకుంది. ఈ కాన్ఫరెన్స్‌కు వరల్డ్‌వైడ్ లెజెండ్స్ ఆఫ్ గెస్ట్సును ఇన్‌వైట్ చేసాం. తెలుగు లాంగ్వేజ్ గొప్పతనాన్ని వరల్డ్‌కు తెలియజేయాలనేదే ఈ కాన్ఫరెన్స్ ప్రైం ఉద్దేశ్యం... అని చెబుతుండగా టీవీ 19–5 విలేకరి వుండి.. మేడమ్, వాట్ అబౌట్ అరేంజ్‌మెంట్స్ అని ప్రశ్నించాడు. దానికామె... అరేంజ్‌మెంట్స్ భారీ స్థాయిలో వుంటున్నాయి... అని చెప్పి ముగించింది. అదంతా విన్న తెలుగుతల్లి... అప్పారావు, ఆమె మాట్లాడింది ఏ భాష అని ప్రశ్నించింది. దానికాయన... ఆమె మాట్లాడిన భాషను తెలుసుకుంటే నీ ఆనందం ఆవిరైపోతుందిలే తల్లి... అలా సీఎం ఛాంబర్‌కు పోదాంపద అని చెప్పాడు. తన ఛాంబర్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి తాపీగా కుర్చునివున్నాడు. అప్పుడే పి.ఏ వచ్చి ఆయన ముందు ఓ ఫైల్ పెట్టాడు. కిరణ్ ఆ ఫైల్ వంక చూసాడు. అంతే ఆయనకు చిర్రెత్తుకొచ్చి... యూజ్‌లెస్‌ఫెలో... ఫైల్ ఇలాగేనా తేవడం, నేను ఎలా చదవాలంటూ విసిరికొట్టాడు. అదిచూసి తెలుగుతల్లి బిత్తరపోయింది. ఏమైంది గురజాడ... ముఖ్యమంత్రి ఎందుకు అంత ఆగ్రహంగా వున్నారు.. ఆ ఫైలులో ఏమన్నా అక్రమాలున్నాయా అని అడిగింది. గురజాడ వుండి... అదేం లేదమ్మా... ఆ ఫైలును తెలుగులో తయారు చేసారు. ఆయనకు దానిని చదవడం రాదు. ఆంగ్లంలో ఎందుకు తయారు చేయలేదని ఆయన కోపం ప్రదర్శించారని చెప్పాడు. ఇక అక్కడ వుండలేక వాళ్లు సచివాలయం బయటకొచ్చారు. అలా నడుచుకుంటూ వెళుతుండగా... ఓ ఇంటి నుండి స్కూలు బ్యాగుతో పిల్లాడు బయటకొచ్చాడు. వాళ్లమ్మకు టాటా చెబుతూ అక్కడేవున్న రాయిని తట్టుకుని ముందుకు పడి... "అమ్మా" అంటూ అరిచాడు. ఆ కేక వినగానే వాళ్ల తల్లి ఇంట్లో నుండి పరుగెత్తుకుంటూ వచ్చింది. అది చూసి తెలుగుతల్లి... చూడు గురజాడ ఆ తల్లి మనసు... ఎంతయినా మాతృప్రేమ కదా... అమ్మా అనగానే పరుగెత్తుకుంటూ వచ్చింది అని చెబుతుండగా... ఆ వచ్చిన తల్లి పిల్లాడి వీపుకేసి బాదుతూ... లక్ష రూపాయలు డొనేషన్ కట్టాం... వేలకువేలు ఫీజులు కడుతున్నాం... నీ నోటి నుండి ఈ మాటలు అనడానికేనా? మేము వీటిని వినడానికేనా? పడి దెబ్బ తగిలినా సరే నీనోట "మమ్మీ" అనే ఇంగ్లీష్ మాటే రావాలిగాని, "అమ్మ" అనే ఆ ముతకమాటే రాకూడదు. ఇంకోసారి "అమ్మ" అన్నావో, నిన్ను కాదు, నీకు చదువు చెప్పే టీచర్ల పని పడతా అని హెచ్చరించింది. ఆ తల్లి హెచ్చరికతో ఆ పిల్లాడు తగిలిన దెబ్బను కూడా మరచిపోయి, ఏడుస్తూనే అలాగే మమ్మీ అంటూ.. స్కూల్ బస్సు ఎక్కాడు. మమ్మీ అనే మాటను తన బిడ్డ నోట వినేసరికి ఆ తల్లి హృదయం పులకించిపోయింది. ఈ రెండక్షరాల పిలుపు కోసమే కదా అక్షరాల లక్షలు ఖర్చు పెట్టేదని ఆమె మనసులో అనుకుంది... ఆ జరిగిన సీన్ అంతా చూసి తెలుగుతల్లి తెగ బాధపడసాగింది. అయినా ఏం చేయగలం అనుకుని ముందుకు కదిలింది. అలా వెళుతుంటే.. రోడ్డు కిరువైపులా "బిస్టాప్", "రొటీన్ లవ్‌స్టోరీ", "ఆరెంజ్", "ఇడియట్", "స్టాలిన్", "రెడీ", "జల్సా", "లవ్‌బర్డ్స్", "అదుర్స్"... సినిమా వాల్‌పోస్టర్‌లు, ఫ్లెక్సీలు వున్నాయి. వీటిని చూసి తెలుగుతల్లి... ఇదేంటి గురజాడ, హైదరాబాద్ నగరంలో ఒక్క తెలుగు సినిమా కూడా ఆడడం లేదా అని అడిగింది. దానికాయన... ఇవన్నీ తెలుగు సినిమాలే కదా తల్లి అని చెప్పాడు. మరి పేర్లన్నీ ఆంగ్లంలో వున్నాయేంటి అని ఆమె అడిగింది. పేర్లే కాదమ్మా, సినిమాలో సగానికి పైగా భాష కూడా ఆంగ్లమే. కాకపోతే పేరుకు తెలుగుసినిమానే అని గురజాడ చెప్పాడు. అలా పోతూవుండగా ఒక ప్రభుత్వకార్యాలయం వద్ద చాలామంది గుమికూడివున్నారు. గురజాడ వెళ్లి ఒకతనితో... ఇక్కడ ఏం జరుగుతుందని అడిగాడు. తిరుపతిలో జరిగే వరల్డ్ తెలుగు కాన్ఫరెన్స్‌లో పాల్గొనే వాళ్ల కోసం అప్లికేషన్స్ తీసుకుంటున్నారని చెప్పాడు. గురజాడ వెంటనే తన పేరుతో ఒక దరఖాస్తు తయారు చేసి అక్కడున్న అధికారికి ఇచ్చాడు. ఆయన ఆ దరఖాస్తును ఎగాదిగా చూసి... అప్లికేషన్ ఇలా ఇస్తే మాకెలా అర్థమవుతుంది... ఇంగ్లీషులో ఫిల్‌చేసి తీసుకురండి అని చెప్పాడు. ఆ మాటకు తెలుగుతల్లికి, గురజాడకు తల తిరిగినంత పనయ్యింది. అక్కడ వుండలేక ఇద్దరూ తెలంగాణభవన్ వద్దకు చేరారు. అక్కడ కేసీఆర్ కల్లు తాగిన కోతిలా... ఎవరా తెలుగు తల్లి, ఎవడికి ఆమె తల్లి... నా తల్లి తెలంగాణ తల్లి. నా భాష, నా భావం అంతా తెలంగాణ అని చిందులేస్తున్నాడు. అది చూసి తెలుగుతల్లి.. గురజాడ, మనం ఇంతవరకు చూసినవాళ్లలో స్వచ్ఛమైన తెలుగు పదాలు వాడింది ఇతడే.. మరి తెలుగుభాషలోనే తెలుగుతల్లిని తిడతాడేంటి? అని అడిగింది. ఆయనకు ఈమధ్య తెలంగాణ అనే తెగులు పట్టుకుందిలే తల్లి అని గురజాడ అనునయించి... తల్లీ, ప్రపంచతెలుగు మహాసభలను పురస్కరించుకుని పోలీస్ గ్రౌండ్స్‌లో "మన రాష్ట్రం – మన గీతం" అనే కార్యక్రమం పెట్టారంట... మనం వెళ్లి హాయిగా విందాం... అని చెప్పాడు. దాంతో ఇద్దరూ పోలీస్‌గ్రౌండ్స్‌కు వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కిరణ్‌తోపాటు పీసీసీ చీఫ్ బొత్స సత్యనారాయణ, కేంద్రమంత్రి చిరంజీవి, రాష్ట్రమంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, గీతారెడ్డి, డి.కె.అరుణ, గల్లా అరుణ, పొన్నాల లక్ష్మయ్య, చంద్రబాబు, ఎమ్మెల్యేలు, పలు ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ విద్యార్థులు వేలసంఖ్యలో వున్నారు. అప్పుడే ఒక వ్యక్తి చేతిలో పచ్చజెండా పట్టుకుని... రెడీ స్టార్ట్ అన్నాడు. అందరూ నోర్లు విప్పారు. "మా తెలుగుతల్లికి మల్లెపూదండ, మా కన్నతల్లికి మంగళారతులు, కడుపులో బంగారు కనుచూపులో కరుణ.." అని పాట పాడుతుంటే తెలుగు తల్లి మైమరచి వింటుంది. పాట మధ్యలోకి రాగానే సడెన్‌గా ఆగిపోయింది.

తెలుగుతల్లి కళ్లు తెరచి చూసింది... అందరి పెదాలు కదలకుండా ఆగాయి... అప్పుడే ఒక వ్యక్తి చేతిలో క్యాసెట్ పట్టుకుని సీఎం వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చి... సార్ "మా తెలుగుతల్లి" పాటల క్యాసెట్ అరిగిపోయి మధ్యలో ఆగిపోయింది. ఇంకో క్యాసెట్ తెప్పించమంటారా అని అడిగాడు. దానికి కిరణ్, అవసరం లేదులే... బ్యాలెన్స్‌పాటను రేపు తిరుపతిలో పాడుకుందాం అని చెప్పాడు. అప్పుడర్థమైంది తెలుగుతల్లికి... "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అనే పాట కూడా డబ్బింగ్ చెప్పుకునే దశకు వచ్చిందని!

★★★★★

## మహిళాదొంగ

సంప్రదాయ దుస్తులు ధరించిన షేక్ బీబీజాన్ అనే మహిళ నెల్లూరు నగరం సిఎయం హైస్కూలు సమీపంలోని తిరిసిపేటలో ఒక్కత్తే వుంటున్న వృద్ధురాలు కోటమ్మ ఇంటి వద్దకు వచ్చింది. తనకో ఇల్లు అద్దెకు కావాలంది. అటువంటి వేమీలేవు వెళ్లమంది కోటమ్మ. అయినా ఆమె కదలలేదు మంచినీళ్లిమ్మంది. అనుమానం వచ్చి లేవు వెళ్లమంది. ఇంట్లోకి వెళ్లి మంచినీళ్లు తీసుకురా అంటూ ముసలవ్వను దబాయించింది బీబీజాన్. నువ్వెళ్లు తల్లి తలుపులు వేసుకోవాలని ఆమెను పంపించేందుకు ప్రయత్నం చేసింది. పెన్ను వుంటే తీసుకురా, నా సెల్‌ఫోన్ నెంబరు రాసిస్తానంది. కోటమ్మ తలవాకిటి వదలివెళ్లలేదు. అటూఇటూ చూసింది వెంటనే ముసలమ్మ మెడలోని బంగారు నగను లాక్కొని తోసేసి పరుగు లంకించుకుంది. ముసలమ్మ లబోదిబోమంటూ కేకలు వేసింది. స్థానికులు వెంటనే స్పందించి బీబీజాన్‌ను పట్టుకొని దేహశుద్ధిచేసి, 4వ నగర పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. పోలీసులను చూడగానే ఆమె ప్లేట్ మార్చేసింది. ఇల్లు అద్దెకు కావాలని ముసల్దాన్ని అడిగితే మా మతాన్ని హేళన చేసింది. నాకు కోపం వచ్చింది. ఆ పెనుగులాటలో కోటమ్మ బంగారుదండ నా దుస్తుల్లో ఇరుక్కోవటంతో అపార్థం చేసుకొని నాపై చేయిచేసుకున్నారంటూ ఏడ్చింది. పోలీసులకు సీను అర్థమయ్యింది. దండ తెంచుకొని ముసలమ్మను తోసేసిన పరుగుల రాణిపై కేసు నమోదు చేశారు.


## కుటుంబనియంత్రణలో నెల్లూరు నెంబర్‌వన్

కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలు చేయించటంలో నెల్లూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ నియంత్రణ కమీషనర్ ప్రవీణ్‌కుమార్ అభినందించారు. 3వతేదీ రాత్రి జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం, వైద్య ఆరోగ్యశాఖాధికారి డా॥మాశిలామణి, ఇంకా వైద్యశాఖ సిబ్బందితో ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కుటుంబనియంత్రణ ఆపరేషన్లలో జిల్లాకు రాష్ట్రంలో మొదటిస్థానం కల్పించిన అధికారుల కృషిని ఆయన ప్రశంసించారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వపరంగా 50లక్షల రూపాయలు అదనపు నిధులు విడుదల చేయటం జరిగిందని ఆయన అన్నారు. జిల్లాలో వైద్యుల కొరతను గుర్తించటం జరిగిందని అందుకై త్వరలో డాక్టర్ పోస్టులను భర్తీచేసేందుకు చర్యలు తీసుకోనున్నామని ఆయన వెల్లడించారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్‌తో పాటు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా॥ మాశిలామణి, అదనపు వైద్య శాఖాధికారి డా॥ పద్మావతి, డీహెచ్‌ఎస్ డా॥నిర్మలలు పాల్గొన్నారు.

PDF Compressor Free Version




## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

తొందరపాటు ప్రవర్తన వల్ల తగాదాలు వచ్చే సూచన ఉన్నాయి. ప్రభుత్వపరంగా జరుగవలసిన పనులు ఆలస్యం కావచ్చును. ఆధ్యాత్మిక, సేవా కార్యములలో పాల్గొంటారు. పరిపాలనాపరమైన, ఆర్థికపరమైన నిర్ణయాలలో తొందరపాటు నిర్ణయాలు గైకొనకుండా జాగ్రత్తపడండి. వ్యాపారవర్గాలకు, వైద్య, న్యాయవాద, మార్కెటింగ్ రంగాలవారికి అవకాశాలు చేజారవచ్చును.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అవసరాలకు సరైన నిర్ణయాలు తీసుకొని లాభపడ తారు. వ్యాపారస్తులకు మంచి అభివృద్ధి ఆదాయముం టుంది. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం జరగడం, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అనుకున్న పనులు అర్థవంతంగా నిర్వహించడం, ప్రముఖుల సలహాలు ప్రోత్సాహం లభిస్తాయి. వృత్తి వర్గాలకు సామాన్యంగా జరిగిపోతుంది.


## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఈ రాశి వారికి ఆదాయం బాగుంటుంది. ఉద్యో గులకు స్థానమార్పు, అధికారుల సహకారం లభిస్తుంది. శుభకార్య నిర్ణయాలు జరగడం, విలువైన వస్తువులు, పరికరాలు సమకూర్చుకొనడం జరుగుతుంది. వృత్తి, వ్యాపార, వ్యవహారాలలో పొరపాట్లు దొర్లకుండా చూచుకొనండి. మిత్రులు, ప్రముఖుల సహకారంతో ఒక సమస్యను అధిగమిస్తారు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కోర్టు వ్యవహారాలలో కొంత ఊరట లభిస్తుంది. షేర్లపై లాభాలుంటాయి. ఉద్యోగవర్గాలకు అధికారుల యొక్క సహచరుల యొక్క సహకారం బాగుంటుంది. శుభకార్యాల ప్రయత్నాలలో పురోగతి ఉంటుంది. అను కున్న పనులు జరుపుకొనే ప్రణాళిక ప్రయత్నాలలో కొద్ది ఆటంకాలుంటాయి. స్థలాలు, స్థిరాస్తులు సమకూర్చు కొనేందుకు కృషిచేస్తారు.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపారులకు సహచరుల నుండి ఆర్థిక సహకా రము, సలహాలు లభిస్తాయి. వ్యాపారవర్గాలకు ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలపై హామీలు, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. కుటుంబ వ్యవహారాలలో సహజీవన వ్యక్తులతో విషయాలు చెప్పగలరు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వృత్తి నిర్వ హణలో ఆదాయం పెరిగి పురోగతి సాధిస్తారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బంధుమిత్రులకు వస్తు, ధన వాగ్రూపంలో సహాయ పడతారు. పెట్టుబడులు, షేర్లపై లాభాలుంటాయి. కఠి నంగా వ్యవహరించడం వల్ల కొందరిని బాధపెట్టగలరు. ఆర్థికముగా బాగుండి వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలందు, పెట్టుబ డులందు నిర్మొగమాటంగా వ్యవహరిస్తారు. అనుకున్న పనులు సమర్థవంతంగా జరుపుకొంటారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 07.12.2012 నుండి
తేది. 13.12.2012 వరకు.

ఈవారము వృషభంలో కేతువుగురువు. కన్యతులవృశ్చికరాశులలో చంద్రుడు, తులలో శని శుక్రులు, 11తేది నుండి వృశ్చికరాశిలో శుక్రుడు. వృశ్చికంలో రవిబుధరాహువులు, ధనుస్సులో కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము: ముహూర్తములు:


1. తేది 7 శుక్రవారం రాత్రి గంట 8.35నుండి 10.47 లోగా కర్కాటకలగ్నమున వివాహ నిషేకములు.
2. తేది 8 శనివారం రాత్రి గంట 8.31 నుండి 10.43 లోగా కర్కాటకలగ్నము మరియు రాత్రి గంట 10.43 నుండి 12.53లోగా సింహలగ్నమున వివాహము.

శంకుస్థాపన లగ్నములులేవు.

### కార్తీకమాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 07 | శుక్ర | నవమి | రా॥ గం.2.43వ॥ |
| తేది. 08 | శని | దశమి | రా॥ గం.1.20వ॥ |
| తేది. 09 | ఆది | ఏకాదశి | రా॥ గం.11.35వ॥ |
| తేది. 10 | సోమ | ద్వాదశి | రా॥ గం.9.34వ॥ |
| తేది. 11 | మంగళ | త్రయోదశి | రా॥ గం.7.24వ॥ |
| తేది. 12 | బుధ | చతుర్దశి | సా॥ గం.5.05వ॥ |
| తేది. 13 | గురు | అమావాస్య | సా॥ గం.2.32వ॥ |


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

పిల్లల విద్యా వివాహ విషయాలు కొద్ది సమస్యా త్మకంగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలలో పొరపాట్లు దొర్లకుండా చూచుకొనాలి. మీ ఆలోచనలు ప్రయత్నాలు అనుకూలంగా నెరవేరుతాయి. వచ్చే ఆదాయం ఖర్చులకు సరిపోతుంటుంది. వాణిజ్యవర్గాలకు అవకాశాలు అభి వృద్ధిలో స్థబ్ధత నెలకొంటుంది. దూరప్రయాణాలు తప్పక పోవచ్చును. దైవసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న పనులు జరుగుతున్నా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. అయినవారి ఆరోగ్యమును గూర్చి ఆందోళన ఉంటుంది. యంత్రాలతో పనులు చేసే వారు, వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా ఉండాలి. స్థిరాస్తులు షేర్లమీద లాభాలుంటాయి. ఆర్థికముగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో నిలద్రొక్కుకుంటారు. వ్యాపారంలో, వృత్తి పరంగా అవకాశాలు దొరకగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలు బాగుం టాయి. వ్యాపారులకు ఆదాయం పెరుగుతుంది. జీవిత భాగస్వామికి ఆరోగ్య లోపం ఉంటుంది. గృహవస్తు వాహన రిపేర్లు ఏర్పడవచ్చును. బిడ్డల విద్యా, వివాహ విషయాలు ఆందోళనకరంగా ఉంటాయి. వృత్తి జీవ నంలోను, పరిశ్రమల యాజమాన్యానికి రాబడి పెరిగి మంచి అవకాశాలు లభిస్తాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

నిర్మాణాలు, గృహరిపేర్లపై నిర్ణయాలు తీసుకొం టారు. షేర్లమీద లాభాలుంటాయి. ధన, వాగ్రూపంలో అయిన వారికి సహాయపడతారు. దూరప్రయాణాలు, విదేశ ప్రయాణాలకు నిర్ణయాలు జరుగవచ్చును. ఆర్థిక స్థితి సంతృప్తికరం. వ్యాపార విస్తరణ, ఆదాయము బాగుం టుంది. శుభకార్య ప్రయత్నాలలో అనుకూల వార్తలు వింటారు. కుటుంబసౌఖ్యముంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

జీవిత భాగస్వామికి, దగ్గర బంధువర్గసభ్యులొకరికి అనారోగ్య బాధ ఉండవచ్చును. గృహ, వస్తు, వాహన రిపేర్ల ఖర్చులు అదనంగా ఉంటాయి. ఖర్చులకు తగినంత ఆదాయముంటుంది. వ్యాపారవర్గాలకు ఆశించిన అవకా శాలుండకపోవచ్చును. బంధువర్గాలతో భేదాభిప్రాయాలు ఏర్పడే సూచనలున్నాయి. ఆర్థికాభివృద్ధికి ప్రయత్నాలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు సాధించుకొనడానికి సర్దుబాటు ధోరణిలో కొనసాగుతారు. ప్రభుత్వ అనుమతులు పొం దడం, నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది. కరెంట్‌తో పనులు చేసేవారు, వాహనాలు నడిపేవారు మెలకువగా ఉండాలి. శరీరమునకు గాయాలు తగలవచ్చును. ఆర్థిక పరమైన, వ్యవహారపరమైన అంచనాలు ఫలించగలవు. వృత్తి వర్గాలకు ఉత్పత్తి, ఆర్థికస్థితి బాగుంటుంది.

### పెదత్రోవ తొక్కిన యువత...

# జైలు ఊచలు లెక్కిస్తున్నారు

తమకు విద్యాబుద్ధులు నేర్పిన నెల్లూరు దర్గామిట్ట సెయింట్‌జోసఫ్ హైస్కూల్‌నే దొంగతనానికి ఫక్కా చేసేసుకున్నారు. స్కూల్‌లో వుండే విలువైన వస్తువులు కంప్యూటర్లే, వాటినే దొంగలించారు, అమ్ముతూ ఒకటవ నగర పోలీసులకు చిక్కారు. చక్కగా ఇంటర్మీడియట్ చదువుతున్నకుంటున్నారు తలా ఒక కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న వీరంతా చిన్ననాటి స్నేహితాన్ని మర్చిపోలేదు. కొంచెం కాలరెగరేసుకొనే వయసొచ్చింది కదా? ఇంకేముంది రాగూడని వ్యసనాలన్నీ అబ్బాయి. జల్సాలకు డబ్బులు కావాల్సి వచ్చింది. ఇళ్లల్లో అంతసీన్‌లేదు. ఇక ఒకటే అడ్డదారి దొంగతనాలు ఎప్పటి నుంచి చిల్లర దొంగతనాలు చేస్తున్నారో? కానీ 2వతేదీ కంప్యూటర్లమ్ముతూ పోలీసులకు చిక్కారు నలుగురు స్నేహితులు. వీరంతా నెల్లూరు నగరం ఖుద్దూస్ నగర్ నివాసితులు. వయస్సు 19 కూడా దాటలేదు.

తల్లిదండ్రులు వీరు చేసిన పనికి తలెత్తుకోలేకపోతున్నారు. వీరిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చటంతో రిమాండ్ చెప్పారు. జైలులో ఊచలు లెక్క పెట్టుకుంటున్నారు. వీరి పేర్లు యస్‌డి.బిలాల్, ఎస్‌డీ.దస్తగిరి, మహమ్మద్ షాబాషా, ఎస్‌కె.అయూబ్‌లు. అరెస్టు సమాచారం తెలిసి ఒకటో నగర పోలీసుస్టేషన్‌కు చేరుకున్న తల్లిదండ్రుల ఆవేదన ఒకరు తీరిస్తే తీరేది కాదు.

# ఆరుతడి పంటలు వేసుకోండి

### జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఆరుతడి పంటలు సాగుచేయండని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ అన్నారు. 3వతేదీ నెల్లూరుజిల్లా కలెక్టర్ కార్యా లయ ప్రాంగణంలోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో వ్యవసాయాధికారులతో ఆయన సమావేశమైనారు. డెల్టా కింద కేవలం 3లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు పూర్తిస్థాయిలో అందించగలమని ఆయన స్పష్టం చేశారు. 40శాతం వర్షలోటు జిల్లాలో వున్నందున ఆరుతడిపంటలైన వేరుశనగ, పెసర, శెనగ, మినుము, పొద్దుతిరుగుడు పంట లను మాత్రమే సాగుచేయండని ఆయన రైతులకు పిలుపునిచ్చారు.

సమావేశంలో వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, ఇరిగేషన్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పిల్లల వితరణ

చిన్నపిల్లలు కాన్వెంట్‌లో చదువుకుంటున్నారు. తమ స్కూల్ ప్రిన్సిపాల్ చెప్పిన దారుణమైన విషయానికి స్పందించారు. 50వేల రూపాయలు చిట్టిచేతుల్తో తీసుకొనివచ్చి మేడమ్‌కిచ్చారు. వివరాల్లోకి వెళితే దుత్తలూరు మండల పరిధిలోని తురకపల్లి గ్రామానికి చెందిన సుబ్బరాయలు, సుభాషిణిల దంపతుల సంతానం నరేష్, ఆ బాబుకు క్యాన్సర్.

ఈ విషయాన్ని తన స్కూల్ పిల్లలకు తెలియజేసింది కోవూరు వశిష్ఠ హైస్కూల్ ప్రిన్సిపాల్ రాధికారెడ్డి. పిల్లలంతా ఆలోచించి వారు దాచుకున్న డబ్బుతో పాటుగా తల్లిదండ్రులకు నచ్చజెప్పి వారిచ్చిన డబ్బు మొత్తం కలిపి తమ ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఆ మొత్తం 50వేల రూపాయలను రాధికారెడ్డి నరేష్ తల్లిదండ్రులకు అందజేశారు. పిల్లల్లో చిన్నతనం నుండి సేవాభావం కలుగజేసేందుకే ఇటువంటి కార్యక్రమాలు చేపట్టున్నామని, గతంలో అంధులకు లక్షరూపాయలు, సాయితేజా అనే విద్యార్థికి 30వేల రూపాయలు తమ హైస్కూల్ పిల్లలు అందజేసివున్నారని రాధికారెడ్డి పేర్కొన్నారు. వితరణశీలురైన విద్యార్థులందరికీ, వారి తల్లిదండ్రులకు ఆమె అభినందనలు తెలిపారు.






## వధువు కావలెను | పెళ్లి సంబంధాలు | వరుడు కావలెను

1. 1980 మే 25 జననం. ఎత్తు 5'6". చదువు యం.యస్.సి ఫిజిక్స్. ఉద్యోగం లెక్చరర్, నారాయణ జూనియర్ కాలేజీ, హైదరాబాద్. జీతం నెలకు 25,000/-. ఆస్తివిలువ 3కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యవసాయకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
2. 1983 నవంబరు 20 జననం. ఎత్తు 5'7". చదువు యం.యస్.కంప్యూటర్స్. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్,నార్త్ కరోలినా. జీతం 100కె. ఆస్తి వాటా 2కోట్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం కడపజిల్లా.
3. 1978 జూలై 5 జననం. ఎత్తు 5'8". చదువు బి.ఇ. ఉద్యోగము సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. జీతం నెలకు 4లక్షలు. ఆస్తివిలువ 4కోట్లు. తండ్రి రిటైర్డ్ టీచర్. స్వస్థలం వెదురుకుప్పం మండలం, చిత్తూరుజిల్లా. మధ్యతరగతి రెడ్డికుటుంబం.
4. 1982 మే 26 జననం. ఎత్తు 5'10". చదువు బి.టెక్, యం.బి.ఎ(హెచ్.ఆర్.యం). ఉద్యోగం సీనియర్ ఎగ్జిక్యూటివ్ కంపెనీ. టెక్నోబ్రెయిన్ ఇండియాప్రై.లిమిటెడ్, జూబ్లీహిల్స్, హైదరాబాద్. జీతం నెలకు 30వేలు. ఆస్తివిలువ 1కోటి. మధ్యతరగతి రెడ్డికుటుంబం.
5. 1983 నవంబరు 28 జననం. ఎత్తు 5'11". చదువు బి.టెక్, యం.బి.ఎ. ఉద్యోగం యస్.ఐ.ఎస్.ఇ, మేనేజర్. మధ్యతరగతి రెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తి విలువ 4కోట్లు.
6. 1984 మే 31 జననం. ఎత్తు 5'3". చదువు బి.ఇ. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఇన్ఫోసిస్. జీతం 35000/-. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివాటా 3కోట్లు. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
7. 1982 సెప్టెంబరు 28 జననం. ఎత్తు 5'4". చదువు యం.బి.బి.యస్, అనెస్థీషియా. నిమ్స్. మధ్యతరగతి రెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
8. 1983 మార్చి 27 జననం. ఎత్తు 5'4". చదువు బి.ఇ. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(నెటాప్). జీతం నెలకు 70వేలు. ఆస్తివాటా 30లక్షలు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం కావలి తాలూకా, ప్రస్తుతనివాసం బెంగుళూరు.
9. 1987 సెప్టెంబరు 3 జననం. ఎత్తు 5'4". చదువు యం.బి.బి.యస్. వ్యాపారరెడ్డి కుటుంబం. స్వస్థలం కడపజిల్లా. ప్రస్తుతనివాసం బెంగుళూరు.
10. 1987 మే 18 జననం. ఎత్తు 5'3". చదువు యం.బి.ఎ(లండన్). ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ప్రస్తుతనివాసం హైదరాబాద్.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413. పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
పోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక. ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



# కల్యాణ వైభవం!



నెల్లూరులోని బొల్లినేని హాస్పిటల్ అధినేత డా॥ బొల్లినేని భాస్కర్‌రావు - రాజశ్రీల కుమారుడు **అభినయ్ - శ్వేత** (రావి వెంకటేశ్వరరావు) - డా॥ సుభాషిణిల కుమార్తెల కల్యాణం నవంబర్ 28వ తేదీ హైదరాబాదులోని ఎన్-కన్వెన్షన్ సెంటర్‌లో వైభవంగా జరిగింది. 30వ తేదీ నెల్లూరులో రిసెప్షన్ వేడుకలు ఘనంగా జరిగాయి. నూతనదంపతులకు'లాయర్' శుభాకాంక్షలు.



విశ్రాంత జిల్లా పౌరసంబంధాలశాఖాధికారి ఎం.వెంకటరత్నం-విజయలక్ష్మిల కుమారుడు **వెంకటకళ్యాణ్ - పవనకృష్ణస్రవంతిల** వివాహం నవంబర్ 29వ తేదీ ఒంగోలులోని శంకరనారాయణ కల్యాణ మండపం నందు జరిగింది. కొత్తదంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



కావలికి చెందిన న్యాయవాది చింతాల వెంకటరావు - పద్మావతిల కుమార్తె **శాలిని - కళ్యాణచక్రవర్తి** ల పరిణయం నవంబర్ 30వ తేదీ కావలిలోని టిటిడి కల్యాణ మండపంలో జరిగింది. నూతనజంటకు 'లాయర్' శుభదీవెనలు.



గూడూరులో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న **బి.అంకమరావు - భార్గవి**ల పెళ్లి నవంబర్ 30వ తేదీ తిరుమలలోని మౌనస్వామి మఠంలో వైభవంగా జరిగింది. నవ వధూవరులకు 'లాయర్' అభినందనలు.

# వసంతలక్ష్మికి ఉత్తమ సేవా పురస్కారం



ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా నెల్లూరీయుల ఆదరాభిమానాలు పొందిన వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శ్రీమతి టి.వసంతలక్ష్మికి ఇండియన్ ఎచీవర్స్ ఫోరమ్ ఫర్ సోషల్ సర్వీస్ అవార్డు లభించింది. ఈ నెల 4వ తేదీన న్యూఢిల్లీలోని ఇండియన్ హాబిటేషన్ సెంటర్‌లో నేషనల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ శ్రీమతి ప్రేమాకురియప్ప చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. మన రాష్ట్రం నుండి ఈ అవార్డును అందుకున్న ఏకైకవ్యక్తి వసంతలక్ష్మి. జాతీయస్థాయిలో కార్పొరేట్స్‌గా వుంటూ సమాజానికి సేవచేస్తున్న వారిని గుర్తించి ఈ అవార్డులు అందజేస్తుంటారు. రవి చిన్నపిల్లల ఆసుపత్రి సహకారంతో వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా 45రోజుల పురిటి పిల్లలకు ఉచిత వైద్యసేవలు అందించడమే కాకుండా పురిటిబిడ్డలలో మరణాల రేటును తగ్గించి, వారికి భవిష్యత్‌లో అంగవైకల్యం రాకుండా చేసిన కృషికిగాను వసంతలక్ష్మికి ఈ అవార్డు దక్కింది.

## ఈ బఫూన్స్

(మొదటిపేజీ తరువాయి)

అంత దమ్ము కూడా వాళ్లకు వుండేది కాదు. కాని వై.యస్. చనిపోయాక వీళ్ల పాటికి వీళ్లు హీరోలుగా ఫీలవుతున్నారు. వై.యస్. ఇమేజ్ వల్లే తాము ఎంపీలమయ్యామన్న విశ్వాసాన్ని మరచి గతంలో ఆయన మీదే విమర్శలకు పాల్పడ్డారు. ఈ విశ్వాసహీనులను తెలంగాణ ప్రజలు అంతగా నమ్మరు. వీళ్లు తెలంగాణ కోసం పోరాడుతున్నామంటే నమ్మడానికి వాళ్లేమన్నా వెర్రి వెంగళప్పలా! తెలంగాణలో తమ ఉనికిని కాపాడుకోవడం కోసమే ఈ పంచకంత్రీలు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీళ్ల ఆకారాలే కాదు మనసులు, ఆలోచనలు కూడా వికారంగానే వుంటాయి. వీళ్లల్లో ఒక్కరికీ మంచిపేరు లేదు. మందా జగన్నాథం డబ్బిలిస్తే పార్టీలు మార్చే వ్యక్తి. మధుయాష్కీపై మనుషుల అక్రమరవాణా ఆరోపణలుండడం తెలిసిందే! పొన్నం ప్రభాకర్ ఏరోజు ఏం మాటమారుస్తాడో తెలియదు. నిలకడలేని వీళ్లకు తెలంగాణ విషయంలో చిత్తశుద్ధి ఎక్కడుంటుంది. వీళ్లకు నిజంగా చిత్తశుద్ధివుంటే తెలంగాణ కోసం ఇదివరకే కాంగ్రెస్‌పార్టీకి, ఎంపీ పదవులకు రాజీనామాలు చేసుండాలి. వీళ్లకు పార్టీ కావాలి, పదవులు వుండాలి, తెలంగాణ వస్తే కావాలి. తెగింపు అనేది ఏ కోశానా ఈ బఫూన్లలో కనిపించదు. అధిష్ఠానం అఖిలపక్ష సమావేశానికి తేదీ ఇవ్వడంతో వీళ్లు ఎగిరి చంకలు గుద్దుకున్నారు. అప్పుడే తెలంగాణ ఇచ్చేసినట్లు, ఇది తాము సాధించిన విజయమన్నట్లు భ్రమలో వున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఇలాంటి బఫూన్లను ఎందర్నో చూసి వుంటుంది. తడిగుడ్డతో గొంతులు కోసే రకం ఆ పార్టీలో చాలామందే వున్నారు. అలాంటి అధిష్ఠానానికి ఈ జోకర్లు, బ్రోకర్లు ఒక లెక్కా? అధిష్ఠానం ఎరవేసి విసిరిన గేలానికి వీళ్లు చిక్కుకున్నారు. కేంద్రం తెలంగాణ ఇచ్చేది లేదు, పెట్టేది లేదు! కాబట్టి వీళ్లు గొర్రెలు కావడం ఖాయం.

## గుజ్రాల్ ఇక లేరు

(మొదటిపేజీ తరువాయి)

ఇందిరాగాంధీతో ఆయన విభేదించిన సందర్భాలు కూడా వున్నాయి. కానీ పత్రికాస్వేచ్ఛను కాలరాయటంలో ఎమర్జెన్సీలో ఆయన పాత్ర ఉంది.

ప్రస్తుత పాకిస్థాన్‌లో భాగమైన జీలంటౌన్‌లో 1919, డిసెంబరు 4న ఆయన జన్మించారు. గాంధేయవాదిగా క్విట్‌ఇండియా ఉద్యమంలో 1942 ప్రాంతంలో జైలుకెళ్లాడు. దేశవిభజన కాలంలో పాకిస్థాన్ నుంచి భారతదేశానికి తరలివచ్చిన కుటుంబాలలో గుజ్రాల్ కుటుంబం ఒకటి. 1950లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ వైస్‌ప్రెసిడెంట్‌గా, 1964లో రాజ్యసభ మెంబరుగా, 1975 ఇందిరాగాంధీ క్యాబినెట్‌లో సమాచార ప్రసారశాఖమంత్రిగా, సోవియట్ రష్యా రాయబారిగా పనిచేశారు. 1980లో సిద్ధాంత విభేదంతో కాంగ్రెస్‌పార్టీ నుండి వైదొలగి జనతాదళ్‌లో చేరారు. 1989లో విపి సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్‌లో విదేశాంగశాఖ మంత్రిగా సమర్థవంతంగా పనిచేసిన ఘనత ఈయనది. దేవేగౌడ ప్రధానిగా వున్నప్పుడు కూడా కేంద్ర క్యాబినేట్‌లో విదేశాంగశాఖ మంత్రిగానే కొనసాగారు. సంకీర్ణంతో చేతులు కలిపిన కాంగ్రెస్‌పార్టీ 1997లో మద్దతు ఉపసంహరించుకుంది. గుజ్రాల్ వివాదరహితుడిగా, అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిగా భారత ప్రధానమంత్రి పదవిలో కొనసాగాడు. ఆయన పదవీకాలంలో నెల్లూరు శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగానికై నెల్లూరు జిల్లాకు వచ్చారు. దేశం ఒక మంచి నాయకుడిని కోల్పోయింది.

## "ఖర్మ"గారం

(5వ పేజీ తరువాయి)

అలాగే నిలిచిపోయివున్నాయి. 2004లో రైతుల భాగస్వామ్యంతో ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీ నడిచేలా చర్యలు తీసుకొని రైతాంగాన్ని కాపాడింది. అనంతరం ఫ్యాక్టరీ నష్టాల్లో కూరుకుపోయింది. కారణం అధికారుల పర్యవేక్షణలో ఫ్యాక్టరీ జరగటం. ప్రభుత్వం నిధులిచ్చినంతకాలం, రైతుల భాగస్వామ్యం వున్నంతకాలం ఫ్యాక్టరీకి చెరకు తోలిన రైతులకు చెల్లింపులు జరుగుతూ వచ్చాయి. క్రమంగా ఫ్యాక్టరీపై రైతుల అజమాయిషీ తగ్గటంతో నష్టాల బాటపట్టింది.

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ముందుకు సమస్యను తీసుకొని వెళ్లారు రైతాంగం. ఆయన స్పందించినట్లే అనిపించింది. అఖిలపక్ష రైతు నాయకులు ఆందోళనలు నిర్వహించారు. గడువులు పెట్టారు. ధర్నాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌కు మహాజరులు అందజేశారు. అయ్యే అసలు కదలికే లేదు. రాష్ట్ర విత్తమంత్రి రెండునెలల క్రితం స్వయంగా రైతుల బకాయిలు చెల్లింప చేస్తానని చెప్పిన మాట. అలాగే ఉంది. మొత్తంమీద సహకార చక్కెర ఫ్యాక్టరీకి ఆస్తులకంటే అప్పులు అధికంగావున్నట్లున్నాయి. క్రషింగ్ ద్వారా వచ్చిన చక్కెర అమ్మకాలు ఆర్థికసంస్థల అప్పులకు వడ్డీలు కట్టడానికి, ఆర్థిక సంస్థలను మార్పుచేసుకొని అధిక మొత్తాలు తీసుకొనేందుకు వ్యయమైపోయిందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. చూడాలి క్రషింగ్ ఏమాత్రం జరుపుతారో? రైతులు మాత్రం ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా వున్నారనేది వాస్తవం.

## రెచ్చిపోతున్నారు...

(2వ పేజీ తరువాయి)

పోలీసులు పట్టుకోవడం, చోరీ సొత్తులో పది రూపాయలు ఖర్చుపెడితే దొంగలు బెయిల్ మీద బయటకు రావడం... యథాతథంగా దొంగతనాలకు పాల్పడడం... చోరీకేసులకు పెద్దగా శిక్షలు లేకపోవడంతో దొంగతనాలకు ఊతమిస్తుంది. ప్రతిఒక్కరు ఇప్పుడు నగదును బ్యాంకుల్లో దాచుకోవడమో లేదా ఇతరత్రా మార్గాలలో పెట్టుబడులు పెట్టడమో చేస్తున్నారు. కాబట్టి డబ్బు ఇళ్లల్లో పెద్దగా వుండదు. దొంగలు డబ్బులు కోసం దోపిడీలకు పాల్పడడం లేదు. వారి దృష్టంతా బంగారం మీదనే. ఇప్పుడు సవరబంగారం 30వేల పైమాటే! ధనికుల ఇళ్లల్లో 50సవర్ల నుండి కేజీ వరకు కూడా బంగారు ఆభరణాలుంటాయి. ఇలాంటి ఇళ్లల్లో దొంగలు పడ్డారంటే వాళ్ల పంట పండినట్లే! బంగారం ధర సవర వెయ్యిరూపాయలకు పడిపోయిందనుకుందాం... ఎక్కడా ఒక్క దొంగతనం కూడా వుండదు. బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో దొంగతనాలు కూడా ఆ రేంజ్‌లోనే జరుగుతున్నాయి. పోలీసులే కాదు.. ఇళ్లల్లో విలువైన సొత్తు పెట్టుకున్నప్పుడు మనమూ జాగ్రత్తగానేవుండాలి.

PDF Compressor Free Version





# డివిజన్ గూడూరు వార్తలు

డాక్టర్ మెహర్మణిని ఘనంగా సన్మానించిన గూడూరు ప్రజలు

## ఆమె సేవలు అనిర్వచనీయం



మెహర్మణిని సన్మానిస్తున్న కళాశాల అధ్యక్షులు అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి

గూడూరు డిఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్‌గా మెహర్మణి అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. కళాశాల ఆవరణంలో ఉద్యోగ విరమణ చేసిన మెహర్మణిని ఇటీవల ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సి.ఆర్.రెడ్డి మాట్లాడుతూ మద్రాసు యూనివర్సిటీలో ఎం.ఎ., ఎం.ఫిల్ పట్టాలను పొంది శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి నుండి పిహెచ్‌డి పట్టా పొంది అప్పుడే పుట్టిన డిఆర్‌డబ్ల్యూ కళాశాలకు ఉపన్యాసకురాలిగా రావడం, అంచెలం చెలుగా ఎదిగి, విశ్వవిద్యాలయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో విఖ్యాతిగాంచిందని, గూడూరులో మహిళలకు కళాశాల విద్య అంతగా అనుకూలంగాలేని పరిస్థితుల్లో మహిళలకు కళాశాలను అనువుగా తీర్చిదిద్దారని అన్నారు. నాక్ 'ఎ'గ్రేడ్ సాధించడంలోను, యుజిసి, సిపిఇ స్థాయి సంపాదించడంలోను, పిజిలో రెండు యుజిసి ఇన్నోవేటివ్ కోర్సులను సాధించారని అవార్డులనెన్నింటినో సొంతం చేసుకున్నారని, కవిత్రయ అవార్డు, రిపబ్లిక్ డే అవార్డు, రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డు పొందారని అన్నారు. కళాశాల అభివృద్ధికి మెహర్మణి ఎనలేని కృషి చేశారని, 32సం॥లు బెస్ట్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఘనత ఆమెకే దక్కిందని అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన మెహర్మణి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. డిఆర్‌డబ్ల్యూ కళాశాల అధ్యక్షులు అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి సభకు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ జె.డి.రెడ్డి, కె.ఎస్.రెడ్డి, కె.సుందరరామిరెడ్డి, డాక్టర్ జనార్ధనరెడ్డి, డాక్టర్ సి.రోహిణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం



సమావేశంలో ప్రసంగిస్తున్న డిఎస్పీ సురేష్‌కుమార్

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని గూడూరు సబ్‌కలెక్టర్ జె.నివాస్, సబ్ డివిజనల్ పోలీసుఅధికారి కె.సురేష్ కుమార్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పనబాక కృష్ణయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 1వ తేదీ శ్రీ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గూడూరు టౌన్ హాలులో ఎయిడ్స్‌వ్యాధిపై హైస్కూలు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సునుద్దేశించి డిఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ ఎయిడ్స్‌వ్యాధిపై విస్తృత ప్రచారం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణసేవాసమితి అధ్యక్షులు మయూరిశ్యాం, ఎఎంసి ఛైర్మెన్ బాబురెడ్డి, టౌన్ సి.ఐ ఉప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శనగా టవర్‌క్లాక్ వద్దకు చేరుకొని ఎయిడ్స్‌వ్యాధికి వ్యతిరేకంగా నినాదాలు చేసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ విస్తృత ప్రచారం, ప్రజల్లో చైతన్యం కారణంగా ఈ వ్యాధి కొంచెం తగ్గుముఖం పట్టిందన్నారు. కార్యక్రమంలో కె.మునిగిరీష్, వివిధ పాఠశాలల, కళాశాలలకు చెందిన విద్యా ర్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. కాగా గూడూరులోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో కూడా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల విద్యార్థినులు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రిన్సిపాల్ కె.మెహర్మణి, భవాని, వై. హేమలత, అధ్యాపక, అధ్యాప కేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అండర్‌బ్రిడ్జి వద్ద.. అవస్థలెన్నో

గూడూరు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రతిరోజూ ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు గురవుతున్నారు. ట్రాఫిక్ స్థంభించిన సమయంలో పోలీసుల్లేక ట్రాఫిక్ నియంత్రణ కరువవుతుంది. భారీ నుండి తేలికపాటి వాహనాలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు అధికసంఖ్యలో ఈ మార్గంలో ప్రయాణిస్తుండటంతో ఈ మార్గంలో వచ్చిన సబ్ కలెక్టర్ సైతం ట్రాఫిక్‌లో చిక్కుకోక తప్పలేదు. ఒకటి, రెండు పట్టణాలకు ఏకైక మార్గమైన ఈ రైల్వే అండర్‌బ్రిడ్జి మీదుగా నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ముఖ్యంగా రద్దీ అధికంగా వుండే ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యతలెత్తుతోంది. ట్రాఫిక్ పోలీసులు దీనికి శాశ్వత పరిష్కారం చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## తెలుగుభాష గొప్పతనం చాటాలి


తెలుగుభాష గొప్పతనాన్ని నలుదిశలా చాటాలని గూడూరు సబ్ కలెక్టర్ జె.నివాస్ విద్యార్థులకు సూచించారు. ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకొని 1వ తేదీ సాయంత్రం గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులచే మా తెలుగుతల్లి గీతాలాపన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారిగా పుట్టినందుకు ప్రతి ఒక్కరూ గర్వించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తిరుపతిలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగుదనం ఉట్టిపడేలా మన సంస్కృతీ సంప్రదాయాలను చాటాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" అనే గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ ఉప్పాల సత్యనారాయణ, మున్సిపల్ డి.ఇ. సీతారామరావు, ఎం.ఇ.ఓ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మూ'వీ'క్షణం



## మరో హిట్ కోసం..

ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో నాని, సమంత కాంబినేషన్‌లో వచ్చిన 'ఈగ' హిట్ కావడం తెలిసిందే. ఇప్పుడు మరో హిట్ కోసం ఈ జంట 'ఎటో వెళ్లిపోయింది మనసు' చిత్రంతో వెండితెర మీదకు రానుంది.



## ప్రిన్స్ పక్కన సోనాక్షి

క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో ప్రిన్స్ మహేష్‌బాబు పక్కన బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హాను హీరోయిన్‌గా ఎంపిక చేయనున్నట్లు తెలుస్తుంది. ఈమేరకు ఆమెతో సంప్రదింపులు కూడా జరుపుతున్నారు. ఈ సినిమాకు 'శివం' అనేది వర్కింగ్ టైటిల్‌గా నిర్ణయించారు.

## విశ్వరూపం



## ఎప్పుడు చూపిస్తాడు!

కమల్‌హాసన్ 'విశ్వరూపం' మీద టన్నులకొద్దీ పుకార్లు వస్తున్నాయి. ఈ పుకార్లను చూస్తుంటే తమిళనాడులో ఆ చిత్రాన్ని నిషేధించే అవకాశాలున్నాయని పిస్తుంది. ఈ సినిమాకు కమల్‌హాసన్ నేరుగా ఎయిర్‌టెల్, టాటాస్కై వంటి డిటిహెచ్ సంస్థలతో 50కోట్లకు డీల్ కుదుర్చుకున్నాడు. దీన్నిబట్టి సినిమా విడుదల రోజే వాళ్ల టీవీలలో ఈ సినిమాను ప్రదర్శించవచ్చు. దీనివల్ల డిస్ట్రిబ్యూటర్లు నెత్తిన గుడ్డేసుకుంటారు.

## 'బాపు'రే...



## ఎన్నాళ్లకెన్నాళ్లకు!

'పద్మ' అవార్డుల ఎంపికలో ప్రతి సంవత్సరం బాపుకు అన్యాయం జరుగుతూనే వుంది. అనర్హులకు కూడా 'పద్మ' పురస్కారాలు అందజేసి మన ప్రభుత్వాలు అవార్డులకు విలువలేకుండా చేసాయి. కాగా ఈ సంవత్సరం 'పద్మ' అవార్డులకు రాష్ట్రప్రభుత్వం 50మంది పేర్లను కేంద్రప్రభుత్వానికి పంపగా, వాటిలో బాపు పేరు వుండడం విశేషం. ఆయనతో పాటు పినాకపాణి, రామానాయుడు, సినారె పేర్లు కూడా వున్నాయి.



## సుడిగాడు వర్సెస్ ఇడియట్


మినిమం గ్యారంటీ హీరోలయిన రవితేజ నటించిన 'సారొచ్చారు', అల్లరి నరేష్ నటించిన 'యముడికి మొగుడు' చిత్రాలు ఈ నెల 21న ఒకేసారి విడుదల కానున్నాయి. ఈ రెండు చిత్రాల్లో బాక్సాఫీసువద్ద ఏ సినిమా హిట్టవుతుందా అనేది పరిశ్రమలో పెద్ద టాక్!

## సాటి లేనిది... వెలకట్టలేనిది...

(7వ పేజీ తరువాయి)

డా॥నాగభైరవ స్మారక సాహితీ అవార్డు గ్రహీత తనికెళ్ళ భరణి స్పందిస్తూ తన ముప్పైఐదేళ్ళ సాహిత్య ప్రస్థానంలో కొన్ని మధుర ఘట్టాలున్నాయని వాటిని మించిన మహత్తర అనుభూతిని ఈ అవార్డు ఇచ్చిందని పేర్కొన్నారు. తాను రచించిన శివస్తోత్రాన్ని వినిపించి సభను ఆధ్యాత్మికతలో ముంచెత్తారు. తనికెళ్ళభరణి రచించి, దర్శకత్వం వహించిన నూతనచిత్రం "మిథునం" ఆడియో సీడీని మురళీకృష్ణ హోటల్స్ అధినేత గ్రోసు గోపాలయ్య దంపతుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయం నిర్వహించిన కవితల పోటీ విజేతలు పల్లాపు హేమంత్‌రాము, ఇనమనమెళ్లూరు నాగరాజారావు, ములుగు లక్ష్మీమైథిలి, అవ్వారు శ్రీధర్‌బాబులకు బహుమతి ప్రదానం జరిగింది. సభప్రారంభానికి ముందు చిన్నారి గాయకులు వివిఎల్ శ్రీకళ, హంసిని, మల్లాది అనూష, సర్వేపల్లి శ్రేయ, సర్వేపల్లి రాజలక్ష్మిలు ఆలపించిన గీతాలు సభికులను అలరించాయి. ఈ వేడుకను తిలకించడానికి వచ్చిన పురప్రజలు, ప్రముఖులతో టౌనుహాలు క్రిక్కిరిసిపోయింది. ఆద్యంతం ఆహ్లాదంగా అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమం విజయం వెనుక చిన్ని నారాయణరావు, కళాంజలి అనంత్‌ల శ్రమ స్పష్టంగా కనిపించింది. చాలారోజుల తర్వాత టౌన్‌హాలు నిండిందనే ప్రశంస ప్రేక్షకుల నోటినుండి వినిపించింది. నారాయణరావు, అనంత్‌లకు 'లాయర్' అభినందనలు.

## కల్యాణ వైభవం!



నెల్లూరుజిల్లా తలమంచి వాస్తవ్యులు, హైదరాబాదులో నివాసం వుంటున్న జొన్న సుబ్బయ్య - రాజేశ్వరమ్మల మనుమడు **వెంకట్‌కార్తీక్** (డా॥ రాధాకృష్ణ, ఝాన్సీలక్ష్మిల కుమారుడు) - **ఆర్తీ** (రామచంద్రన్ అయ్యర్, రజని అయ్యర్‌ల కుమార్తె) వివాహం డిసెంబర్ 5వ తేదీన హైదరాబాదులోని మారియట్ హోటల్‌లో జరిగింది. నవదంపతులకు'లాయర్' అభినందనలు.



ఆంధ్రాబ్యాంకు మేనేజర్ బండారు సుధాకర్‌రెడ్డి - శ్రీమతి సుభాషిణిల కుమారుడు **శివతేజకుమార్‌రెడ్డి - చందన** (హైదరాబాద్ వాస్తవ్యులు యరమాక జనార్ధన్‌రెడ్డి - శ్రీమతి లక్ష్మిల కుమార్తె)ల కల్యాణం నవంబర్ 30వ తేదీన నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## పల్లెపాడు పులకించింది..

పురాతన ఆలయ జీర్ణోద్ధరణ

# భక్తిభావంతో తరించింది





నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలంలోని పల్లెపాడు గ్రామంలో దాదాపు 500సంవత్సరాలక్రితం నిర్మించబడిన శ్రీరామేశ్వర, మీనాక్షి, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానాలను ఆధునీకరించి జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఆ గ్రామస్థులు. ఆహ్లాదకరమైన ప్రాంగణంలో పవిత్ర పెన్నానది తీరాన సుమారుగా 481సంవత్సరాలక్రితం ఈ దేవాలయం ఏర్పడినట్లు ప్రతీతి. ఉత్తర వాహినిగా పినాకిని నది ఆలయానికి పడమటి వైపున ప్రవహిస్తుండడంతో కాశీ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలతో సమానంగా ఈ దేవాలయం ప్రసిద్ధిగాంచింది. బాగా పురాతనమై శిథిలావస్థకు చేరుకున్న ఈ పుణ్యప్రాంగణాన్ని గ్రామ పెద్దల సహాయసహకారాలతో పునర్నిర్మించుకున్నారు పల్లెపాడు గ్రామస్థులు.

ఒకే ప్రాంగణంలో శ్రీ రామేశ్వరుడు, మీనాక్షి అమ్మవార్ల ఆలయాలతో పాటు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాలను నిర్మించడమే కాకుండా నవగ్రహాలను, అభయాంజనేయస్వామి, నాగప్రతిష్ఠలతో పాటు వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, చండీశ్వరస్వామి కొలువయ్యేట్లుగా నూతన నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఏప్రియల్ 15వతేదీ నుండి జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టి 720రోజులలో పూర్తిచేసి డిసెంబర్ 3,4,5తేదీలలో పూజాకార్యక్రమాలను నిర్వహించి 5వతేదీ విగ్రహాలను పునఃప్రతిష్ఠ చేశారు. 5వతేదీ ఉదయం నుండీ జరిగిన పలు హోమాలు, ధ్వజస్థంభాల ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, వసంతోత్సవం తదితర కార్యక్రమాలలో పల్లెపాడు పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు వేలాదిగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆధునిక హంగులతో దేవస్థాన ప్రాంగణానికి కొత్త శోభను తీసుకొచ్చారు. ఈ ఆలయాలన్నిటికీ కలిపి ఒకే ప్రహరీని నిర్మించి దేవతామూర్తులంతా ఒకే ప్రాంగణంలో కొలువయ్యేలా ఏర్పాటుచేశారు. అంతేకాకుండా ఒకే ప్రాంగణంలో రెండు ధ్వజస్థంభాలను ఏర్పాటు చేయడం విశేషం. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శిల్పి యర్రా నానాజీ ఆధ్వర్యంలో అత్యంత ఆకర్షణీయంగా ఆలయ గోపురాలను పునర్నిర్మించారు. గ్రామానికి వన్నెతెచ్చే స్థాయిలో ఈ గోపురాలన్నింటినీ తీర్చిదిద్దారు. ప్రముఖ పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రాజశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో ఈ మూడురోజుల కార్యక్రమాలు జరిగాయి. 5వ తేదీ సాయంత్రం జరిగిన శాంతికల్యాణంతో పాటు భారీస్థాయిలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో కేరళ నుండి ప్రత్యేకంగా తెప్పించిన వాయిద్యాలతో పాటు, అశ్వాలు, నందీశ్వరులకు ప్రతిరూపాలైన ఎద్దులు, కళ్ళు మిరుమిట్లు గొలిపే బాణాసంచాలు ఆకర్షణగా నిలిచాయి. దేవతామూర్తులను గ్రామోత్సవం ద్వారా వీధులన్నింటిలోనూ ఊరేగించారు. ఎప్పుడో పురాతన రోజుల్లో జరిగిన ఇలాంటి వేడుకను మళ్లీ చూస్తున్నామని ఆ తరం వారు, తొలిసారిగా ఇలాంటి సంబరాలను వీక్షిస్తున్నామని ఈ తరం వారు చెప్పుకోవడం గమనార్హం. ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారంచుట్టి అంకితభావంతో, అకుంఠిత దీక్షతో రాత్రింబవళ్లు శ్రమించి అనుకున్న సమయానికి ఆశించిన స్థాయిలో తక్కువ వ్యయంతో పెద్దస్థాయిలో ఈ జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని పూర్తిచేసిన నిర్వాహకుల జీవితం ధన్యం.







Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Lavout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003, Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**.